# కల్వరి ప్రేమధార

(ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక)



నేను నీకు మొఱ్ఱపెట్టుకొనియున్నాను దేవా,
నీవు నాకుత్తరమిచ్చెదవు నాకు చెవియొగ్గి నా మాట ఆలకించుము.కీర్తన 17:6

జూలై-ఆగష్టు 2020
విడి ప్రతి వెల రూ:20/-

ఎడిటర్:
డా: యన్. జయపాల్



# నాశనకరమైన తెగులు రాకుండ నిన్ను రక్షించును!

(కీర్తన 91:3)

ఈ Carona Virus అనేది ఒక నాశనకరమైన తెగులుగా; ఎక్కడో చైనాలో ప్రారంభమై, ప్రపంచమంతటా అతిత్వరలో వ్యాపించి; ఎక్కడ వారిని అక్కడ స్థంభింప జేయటం, ఎంతోమందిని పొట్టన పెట్టుకొనడమును గురించి మనం వింటుండగానే ఇది ఇప్పడు మన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలోని గ్రామాలకు కూడా సోకడం చూస్తున్నప్పడు ఎంతో వేదన కలుగుచున్నను, మనము భయపడక దేవునికి మొఱ్ఱపెట్టుచున్నాము!

ఏ తెగులు నీ గుడారమును సమీపించకుండా కాపాడే ప్రభువు ఉన్నాడని నమ్మి, ఆయన రెక్కల చాటున దాగియుంటే ఏ అపాయము మనకు కలుగదు (కీర్తన 91:1-3). ఈ 91వ కీర్తనలోని ప్రతి వాక్యమును ఒక వాగ్దానముగా తీసుకొని, విశ్వాసముతో ప్రార్థిస్తే; ప్రతి కీడు నుండి ప్రభువు మనలను విడిపించును.

ఈ Covid-19 మహమ్మారి లోకాన్ని వణికిస్తుండగా, మనము యేసు నామ మందు విశ్వాసముంచి, ఆయన పొందిన దెబ్బల వలన మనకు స్వస్థత ఉన్నదని నమ్ముదాం (యెషయా 53:5). అంతేగాక, పనులు లేకపోవుట వలన ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతున్న వారి కొరకు ప్రార్థించుదాము! మన ప్రభువు మన సంకటములన్నీ కుదుర్చునని నమ్ముదాం (కీర్తన 103:3).

మరనేకులు జీతము రాక, ఉద్యోగములు పోయి, రకరకాల బాధలతో ఉండగా; దేవుడు తన ఐశ్వర్యము చొప్పన మన ప్రతి అవసరత తీర్చునని నమ్ముదాం (ఫిలిప్పీ 4:19). ఇతర దేశాలలో ఉన్న మన తెలుగు వారు ఎన్నో కష్టాలకు గురవు తుండగా, 'నాకు మొఱ్ఱపెట్టుము, నేను నీకు ఉత్తరమిచ్చెదను' (యిర్మీయా 33:3) అన్న ప్రభువు నామములో ప్రార్థించుదాం, విశ్వసిద్దాం!

అంత్య దినములలో మనం ఉన్నామని, అక్రమము విస్తరించిపోతుండగా మనం విశ్వాసమును, పరిశుద్ధతను కాపాడుకొందాం! ప్రతి దినము దేవునితో సహవాసము చేయుచు; మోకాళ్ళ ప్రార్థన, బైబిలు పఠనముల ద్వారా ఆధ్యాత్మిక శక్తి పుంజుకొనుచు; సాతానును ఎదిరించుచు, ప్రభువు రాకడ కొరకు సిద్ధపడదాం!

హల్లెలూయ! ఈ Covid-19 మహమ్మారి రోగానికి మందు లేదని అంటున్నను; కొందరు మరణించుచున్నను, మరెందరో రోగపీడితులగుచున్నను, ప్రపంచమంతటా ఉన్న దేవుని బిడ్డలు ఇట్టి పరిస్థితులలో తమ్ము తాము తగ్గించుకొని, ఎందరో యేసు నామములో ప్రార్థించుచున్నందున; ఇప్పడు అద్భుతముగా కోలుకొనేవారి సంఖ్య (Recovery) పెరగటం, మరణాల సంఖ్య తగ్గటం జరుగుచున్నది. ఇంకనూ దేవుని బిడ్డలమైన మనం మరింత భారముతో ప్రార్థించి, విజ్ఞాపన చేస్తే తప్పక ప్రభువు ఈ భయంకరమైన తెగులును ఆపి మనలను స్వస్థపరచును. **- యన్. జయపాల్**

# కల్వరి ప్రేమధార

ఎడిటర్: యన్. జయపాల్ — జూలై - ఆగస్టు 2020

కల్వరి 36 {ఈ పత్రిక ఉచితం కాదు, కనీస వార్షిక విరాళము రూ.120/-; ప్యాకింగ్ & పోస్టేజి రూ.30/- అదనం!} ధార 4

Vol-XXIII ISS-IV

Jul-Aug 2020 R.N.I. No.69868/98


## ముఖాముఖి

ప్రభువునందు ప్రియులైన 'కల్వరి ప్రేమధార' పాఠకులకు, శ్రేయోభిలాషులకు క్రీస్తు నామమున శుభమని చెప్పి వ్రాయుట!

మీరందరూ ఎలా ఉన్నారు? మీ క్షేమం కోసం ప్రార్థిస్తున్నాను! ఈ Covid-19 కరోనా వైరస్ వలన ఆలయములలో ఆరాధనలు, గెట్-టుగెదర్‌లు జరిపించ లేకపోతిమి! ప్రపంచమంతటా ఇదే పరిస్థితి ఉండగా, మనం మునుపటి కంటె మరి ఎక్కువగా దేవునికి మొఱ్ఱపెట్టవలసిన అవసరత ఉన్నది.

'మార్చి-ఏప్రిల్' కల్వరి ప్రేమధార సిద్ధపరచి ఉన్నప్పటికీ, పరిస్థితిని బట్టి ఆలస్యంగా పోస్ట్ చేసాము! ఆ పత్రిక మీకు అందినదని నమ్ముచున్నాము! ఒకవేళ అందని యెడల మాకు తెలియపరచండి!

చెన్నై రెడ్‌జోన్‌గా ప్రకటించినందున మే-జూన్ పత్రికను పోస్ట్ చేయుటకు వీలుపడలేదు. ఎక్కడి పనులు అక్కడే స్థంభించిపోయినవి. ఇంకనూ ఇంచుమించు అటువంటి పరిస్థితియే కనిపించు చున్నది. అయినను విశ్వాసముతో ఇప్పడు 'జూలై-ఆగస్టు' పత్రికను పోరాటాల మధ్య పోస్ట్ చేస్తున్నాము! ఈ పత్రిక అందిన వెంటనే మాకు తెలియజేయండి! మరియు ఇట్టి కష్ట సమయములో ఈ పరిచర్యను కొనసాగించునట్లు మీ వార్షిక విరాళములు, బకాయిలు, కానుకలు చెల్లించి సహకరించండి!

దేవుని కృప వలన ఇప్పడు ప్రతిరోజు ఉదయం 7:00 గం॥లకు 'అనుదిన ధ్యానం', రాత్రి 9:00 గం॥లకు 'కల్వరి ప్రతిధ్వని' LIVE కార్యక్రమాలు **"Dr Jayapaul"** యూట్యూబ్ మరియు ఫేస్‌బుక్‌లో ఇవ్వటం జరుగు చున్నది. మీరు వీక్షిస్తున్నారా? తెలియజేయండి! విశ్వాసముతో టి.వి. కార్యక్రమాలు అన్నీ కొనసాగి స్తున్నాము! ప్రార్థించండి!

- ఎడిటర్

## ఈ సంచికలో....


★ చాచిన చేతులు నీ కొరకే!
★ రాజులు మొదటి గ్రంథము
★ గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు
★ నోవహు కుటుంబము
★ శాస్త్రవేత్తలు – అన్వేషణలు
★ లాగుడు బండి క్రైస్తవులు
★ అతడు నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు
★ యేసు పద్ధతా? లోక పద్ధతా?
★ జెబెదయి కుమారుల తల్లి
★ ముచ్చటైన మూడు విషయాలు
★ ఎపఫ్రా
★ అయ్యో! నేను అపవిత్రుడను!
★ క్రీస్తు అనుకరణ
★ నా కొరకు నీవేమి చేసితివి!
★ అర్థాలు తెలుసుకొందాం!
★ జాన్ నాక్స్
★ కల్వరి ప్రచురణలు
★ వీక్షించండి! – ప్రార్థించండి!
ఇంకా...ఇంకా...ఎన్నెన్నో....



*Our Only Address:*

**JAYAPAUL FOUNDATIONS**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY,**
**CHENNAI-600 042.**

**Phone : 044-2243 4787**
**Cell : (0) 98847 07779,**
**(0) 89 39 39 39 39**
**E-mail : Enquiry@jayapaul.com**
**Website : www.jayapaul.org**

సంపాదకీయం:

# చాచిన చేతులు నీ కొరకే!

**"లోబడనొల్లని ప్రజల వైపు దినమంతయు నా చేతులు చాపుచున్నాను".**
(యెషయా 65:2)

దేవుని ప్రేమ ఎంత ఉన్నతమైనదో మనమీ వచనము ద్వారా తెలుసుకొనగలము! ఆయన ప్రేమ పాపులను ప్రేమించే ప్రేమ, అవిధేయులను సహించే ప్రేమ, శత్రువులను క్షమించి ప్రేమించే ప్రేమ! లోబడనొల్లని ప్రజల వైపు దినమంతయు నా చేతులు చాపుచున్నానన్న ప్రేమ ఎంత ఉన్నతమైనదో చూడుడి! "అవిధేయులై యెదురాడు ప్రజలకు దినమంతయు నా చేతులు చాచితిని" (రోమా 10:21) అన్నది ఎంత అద్భుతమైన ప్రేమో చూడండి! అవును ప్రియులారా, "దేవుడు తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు. ఎట్లనగా మనమింకనూ పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా 5:8).

"నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని, వారు నా మీద తిరుగబడి యున్నారు" (యెషయా 1:2) అని దేవుడు వేదనపడుచున్నాడు. మట్టిగా ఉన్న మనకు జీవమునిచ్చి, ప్రాణాత్మలను పొదిగి, జీవింపజేయుచున్న దేవునిపై మనము తిరుగబడుట ఎంత భయంకరము? అయినను అవిధేయులై తిరుగబడుచున్న మనలను దేవుడు ప్రేమించుట ఎంత ఆశ్చర్యము!

ఎంతో కాలము నుండి దేవుని ప్రేమను తృణీకరించుచు, ఆయన ప్రేమ గల హస్తములలో చేరకుండా తిరుగులాడుచున్న సోదరా! సోదరీ!! దేవుని ప్రేమ నిన్ను వెంటాడుచు తిరుగుచున్నదని గ్రహించితివా?

నా జీవితములో 18 సంవత్సరముల వరకు ఆయన ప్రేమ గల హస్తములలో చేరక, నా ఇష్టానుసారమైన మార్గములో తిరిగితిని. ఆయన సువార్తను వినిన తరువాత కూడా కొన్ని మాసములు దేవునిపై తిరుగబడితిని. అయినను నన్ను ప్రేమించిన ప్రభువు నాకు సిలువలో దర్శనమిచ్చెను. చాచిన చేతులతో సిలువపై వ్రేలాడుచున్న క్రీస్తు ప్రేమను కాదనలేక ఆయన పాదాలపై పడి పశ్చాత్తాపపడితిని.

'ఆహాఁ! ఇది ఎంత అద్భుతమైన ప్రేమ' అని అప్పటి నుండి అనగా గత 49 సంవత్సరముల నుండి ఆశ్చర్యపడుచు, 'ఇది లోబడనొల్లని వారిని, అవిధేయులై యెదురాడు వారిని, పాపములో నశించిపోవుచున్న వారిని ప్రేమించే గొప్ప ప్రేమ' అని గుర్తించితిని! అందుకే ఈ ప్రేమను ప్రకటించకుండా ఉండలేకపోవుచున్నాను.

"రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును, మీ

దేవునికిని అడ్డముగా వచ్చెను" (యెషయా 59:1). అవును ఆయన హస్తము కురచైనది కాదు. నోరుండియు పలుకని, కన్నులుండియు చూడని, చెవులుండియు వినని, చేతులుండియు కదలని, పాదములుండియు నడువని విగ్రహముల వంటి వాడు కాదు మన ప్రభువు. (కీర్తన 115:4-8 చదవండి!).

ఆయన ప్రేమ కలిగిన హస్తములు పాపములో ఎంతగా మునిగిపోయిన వారినైనా, ప్రభువు దగ్గర నుండి ఎంత దూరముగా పారిపోవుచున్న వారినైనా చేరగలవు! ప్రపంచములోని ప్రతివానిని రక్షించుట కొరకు మారుమూల గ్రామాలలో, ఎత్తైన కొండలలో, లోతైన లోయలలో ఉన్న ప్రతివానిని ప్రేమించగలవు!

నీ స్వంత ఆలోచనలకు లోబడి, నీ స్వంత మార్గములో నీ ఇష్టమును, ఇచ్ఛలను నెరవేర్చుకొనుటకు పరుగెత్తే ప్రియ సోదరా! చేతులు చాచి నిన్ను పిలుచుచున్న క్రీస్తు ప్రేమను నీవు చూచితివా? దినమంతయు, సంవత్సరమంతయు, నీ బ్రతుకంతయు నిన్ను వెంటాడుచు బ్రతిమిలాడుచున్న యేసయ్య హస్తాలను నీవు చూచితివా? "స్త్రీ తన గర్భమున పుట్టిన బిడ్డను కరుణింపకుండ తన చంటిపిల్లను మరచునా? వారైన మరచుదురు గాని, నేను నిన్ను మరువను. చూడుము నా యరచేతుల మీదనే నిన్ను చెక్కియున్నాను" (యెషయా 49:15,16) అన్న ప్రభువు ప్రేమను రుచి చూచితివా?

నీ కొరకు గాయపరచబడిన ఆయన హస్తములు చూడుము! నీ సకల పాపములు కడిగివేయగలిగిన రక్తము ఆయన చేతులలో యున్నది. నీవు ఆయన వైపు తిరిగి ఆయన రక్తములో పావనుడవు కమ్ము! అప్పుడు ఆయన నిన్ను తన కుమారునిగా స్వీకరించి, 'ఈ నా కుమారుడు తప్పిపోయి దొరికెను, చనిపోయి బ్రతికెనని' సంతోషించును. నీ స్వంత ఆలోచనలను, నీ స్వంత చిత్తమును విడిచిపెట్టి; నిన్ను ప్రేమించి, నీ కొరకు తన ప్రాణమిచ్చి, నిన్ను వెంటాడుచున్న క్రీస్తును నీ హృదయములోనికి స్వీకరించు!

**- యస్. జయపాల్**

## వెంటనే బాప్తిస్మము పొందినవారు

| | |
|---|---|
| ★ పెంతెకొస్తు నాడు యూదులు | (అపొ. కార్య. 2:41) |
| ★ ఐతియొపీయుడగు నపుంసకుడు | (అపొ. కార్య. 8:36-38) |
| ★ సౌలు (పౌలు) | (అపొ. కార్య. 9:18) |
| ★ కొర్నేలీ | (అపొ. కార్య. 10:47,48) |
| ★ లూదియ | (అపొ. కార్య. 16:15) |
| ★ ఫిలిప్పీ జైలు అధికారి | (అపొ. కార్య. 16:33) |
| ★ ఎఫెసీయులు | (అపొ. కార్య. 19:15) |

# రాజులు మొదటి గ్రంథము

| | | | |
|---|---|---|---|
| గ్రంథకర్త | : యిర్మీయా కావచ్చు! | అధ్యాయములు | : 22 |
| కాలము | : క్రీపూ. 646-570 కావచ్చు | వచనములు | : 815 |
| ముఖ్యాంశము | : రాజ్య విభజన | ముఖ్య వచనములు | : 9:4-9; 22:19 |

**గ్రంథ విభజన**

| | | |
|---|---|---|
| 1 - 10 అధ్యాయములు | : | సొలొమోను రాజు వైభవము, జ్ఞానము |
| 11వ అధ్యాయము | : | అన్యురాండ్రను వివాహమాడుట |
| 12 - 22 అధ్యాయములు | : | రాజ్య విభజన - రాజుల విఫలత |

సమూయేలు రెండు గ్రంథాలు, రాజులు రెండు గ్రంథాలు, దిన వృత్తాంతములు రెండు గ్రంథాలు ఇవన్నీ పూర్వము ఒకే గ్రంథముగా ఉండేవి! వీటిని హెబ్రీ భాష నుండి గ్రీకు భాషలోనికి 70 మంది తర్జుమా చేసినప్పుడు అనుకూలముగా ఉండునట్లు రెండేసి గ్రంథాలుగా విభజించారు.

రాజుల గ్రంథములో రారాజైన యేసయ్యను చూడగలము! సొలొమోను యొక్క పరిపాలన ప్రభువు యొక్క వెయ్యేండ్ల పాలనకు గుర్తుగా ఉన్నది. సొలొమోను యొక్క వైభవ పాలన ఇశ్రాయేలీయుల చరిత్రలో 'స్వర్ణయుగము' లాంటిది! అయితే సొలొమోను పాపము రాజ్యము చీలిపోవుటకు మూల కారణమయ్యెను.

ఈ గ్రంథములో రెండవ ప్రధాన వ్యక్తి ఏలీయా! ప్రవక్తయైన ఏలీయా బాప్తిస్మమిచ్చు యోహానుకు గుర్తు! అయితే ఏలీయా యొక్క సూచక క్రియలు, ప్రవక్త పదవి – ప్రభువైన యేసుకు, ఆయన పరిచర్యకు గుర్తు!

సొలొమోను మొదలుకొని యూదా రాజైన యెహోషాపాతు, ఇశ్రాయేలు రాజైన అహజ్యా వరకు గల రాజుల జీవితములు ఈ గ్రంథములో ఉన్నవి! దేవుని యెడల విధేయులుగా, నమ్మకస్థులుగా ఉండినచో రాజ్యమునకు, ప్రజలకు క్షేమమని; అవిధేయులుగా జీవించి భ్రష్టత్వమునకు చోటిచ్చినచో దేవుని తీర్పుకు, శిక్షకు గురియగుదురని ఈ గ్రంథములో ఉన్న రాజుల చరిత్రల ద్వారా నేర్చుకొనుచున్నాము!

సొలొమోనుచే యెరూషలేములో దేవుడు మందిరము నిర్మింపజేసెను. అయితే సొలొమోను ఆత్మానుసారముగా మొదలుపెట్టి, శరీరానుసారముగా ముగించెను. సొలొమోను రాజ వైభవము గంభీరముగా ఉండెను గాని, సొలొమోను హృదయము దేవుడైన యెహోవా యెడల యథార్థముగా లేకపోయెను. కాబట్టి సొలొమోను హృదయము చూసిన దేవుడు సొలొమోనును తృణీకరించెను.

అయితే ఈ గ్రంథములో మండుచున్న హృదయము గల ఏలీయాను, మనకు తెలియని ఏడు వేల మంది నమ్మకమైన సాక్షులను గురించి మనము చూడగలము! సొలొమోను కీర్తి, మహిమ, సంపన్నత, ఘనత క్రీస్తు ప్రభువుకు సూచనగా ఉన్నవి. సొలొమోను పాలనలో ఉన్న నెమ్మది, జ్ఞానము, ఆలయములోని ఆరాధన యేసు ప్రభువు రాజ్యానికి సూచనగా ఉన్నవి! అయితే యేసు ప్రభువు సొలొమోను కంటె గొప్పవాడు (మత్తయి 12:42).

– యస్. జయపాల్

# గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు

(గత సంచిక తరువాయి....)



**"మరియు నేను చూడగా, ఇదిగో, ఆ గొఱ్ఱెపిల్ల సీయోను పర్వతము మీద నిలువబడియుండెను. ఆయన నామమును ఆయన తండ్రి నామమును నొసళ్ల యందు లిఖింపబడియున్న నూట నలువది నాలుగు వేల మంది ఆయనతో కూడ ఉండిరి".**
(ప్రకటన 14:1)

సాతాను ముద్ర వేయించుకొన్నవారు పాతాళమునకు సిద్ధపడుచుండగా; యేసుక్రీస్తునందు విశ్వాసముంచి, ఆయన రక్తములో కడుగబడినవారి నొసళ్లయందు ఆయన నామము లిఖించబడునని పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తున్నది.

లోక పాపములను మోసికొనిపోయే దేవుని గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు పాపముల విషయములో శుద్ధీకరణ తానే చేసి దేవదూతల కంటె ఎంత శ్రేష్ఠమైన నామము పొందెనో వారి కంటె అంత శ్రేష్ఠుడై ఉన్నత లోకమందు మహామహుడగు దేవుని కుడి పార్శ్వమందు కూర్చుండెను. ఆ శ్రేష్ఠమైన నామమందు విశ్వాసముంచి, ఆయన రక్తములో కడుగబడిన వారందరు ఆయన రాజ్య వారసులగునట్లు ఆశీర్వదించెను.

ఇక్కడ ఆయన నామమును, ఆయన తండ్రి నామమును నొసళ్ళయందు లిఖించబడిన నూట నలువది నాలుగు వేల మంది ఆయనతో ఉండుట చూస్తున్నాము! వీరు గొఱ్ఱెపిల్ల ఎక్కడికి పోవునో అక్కడికెల్ల నమ్మకముగా వెంబడించినవారు. వీరు గొఱ్ఱెపిల్ల రూపములో ఉన్న కౄరమృగమునకు లోబడక, దాని ముద్రను వేయించు కొనక క్రీస్తును వెంబడించినవారు. వీరు దేవుని కొరకు, గొఱ్ఱెపిల్ల కొరకు ప్రథమ ఫలముగా ఉండుటకు మనుష్యులలో నుండి కొనబడినవారు. వీరి నోట ఏ అబద్ధము లేదు, వీరు అనింద్యులు. వీరు స్త్రీ సాంగత్యమును ఎరుగనివారు, గొఱ్ఱెపిల్లను వెంబడించువారు (ప్రకటన 14:4,5).

"వివాహము అన్ని విషయములలో ఘనమైనదని" బైబిలు చెప్పుచున్నది (హెబ్రీ 13:4). "నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదని" దేవుడే వివాహమును సిద్ధపరచెను (ఆదికాండము 2:20-22). కనుక వివాహము పాపమని చెప్పుటకు వీలు లేదు. జారత్వము, వ్యభిచారము, కాముకత్వము అనునవి నీచమైన పాపములు గనుక దేవుడు వేశ్యాసంగులకును, వ్యభిచారులకును తీర్పు తీర్చును (హెబ్రీ 13:4)

అని బైబిలు తెలియజేస్తున్నది. మరియు లైంగిక వ్యభిచారము మాత్రమే గాక, ఆధ్యాత్మిక వ్యభిచారాన్ని గురించి కూడా బైబిలు హెచ్చరిస్తున్నది.

"వ్యభిచారిణులారా, ఈ లోక స్నేహము దేవునితో వైరమని మీరెరుగరా?" (యాకోబు 4:4). "ఈ లోకమునైనను లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు" (I యోహాను 2:15). లోకముతో స్నేహము చేయువాడు, లోకమును ప్రేమించు వాడు తన్ను అపవిత్రపరచుకొని దేవుని సాంగత్యమును పోగొట్టుకొనుచున్నాడు. విగ్రహారాధన ఆధ్యాత్మిక వ్యభిచారమే! దేవుని స్థానాన్ని మరి దేనికిచ్చినా అది విగ్రహారాధనే! (యిర్మీయా 3:13).

అయితే వీరు లోకము, సాతాను అనే స్త్రీ సాంగత్యము వలన అపవిత్రులు కానివారై తమ్ము తాము సంపూర్ణంగా ప్రభువుకు సమర్పించుకొని క్రొత్త కీర్తన పాడుచున్నారు. భూలోకము నుండి కొనబడిన వీరు తప్ప ఆ క్రొత్త కీర్తన దూతలు కూడా పాడలేరు. అది విమోచనా గీతము, అది సువార్త సునాదము, అది స్తుతి ఆరాధన! ఆ పాట విస్తారమైన జలముల ధ్వనితోను, గొప్ప ఉరుముల ధ్వనితోను సమానమైన వీణెల నాదముగా ఉన్నది. ప్రభువును స్తుతిస్తూ, స్తుతి ప్రతిధ్వనులతో నిండిన ఆ రాజ్యము కొరకు మనం సిద్ధపడాలి!

ఇక్కడ దూతల సువార్తను వింటున్నాము! అంతవరకు దూతలు వర్తమానములు అందించుటకే వాడబడినవి! గాని, సువార్త ప్రకటించు భారము క్రీస్తు రక్తములో కడుగబడిన మనపై పెట్టబడినది. అయితే ఇక్కడ – 'మీరు దేవునికి భయపడి ఆయనను మహిమపరచుడి; ఆయన తీర్పు తీర్చు గడియ వచ్చియున్నది' అని మొదటి దూత 14:6,7 వచనాలలో ప్రకటించుచున్నది. క్రీస్తు విరోధి రాజ్యమైన మహా బబులోను కూలిపోయెను అని రెండవ దూత 14:8లో ప్రకటించుచున్నది. క్రీస్తు విరోధికి నమస్కరించినవారు యుగయుగములు అగ్ని గంధకములచే బాధింప బడుదురు అని మూడవ దూత 14:9-11 వచనాలలో ప్రకటించుచున్నది.

తమ నొసళ్ల మీద లేక చేతి మీద సాతాను ముద్ర వేయించుకొనినవారు రాత్రింబగళ్లు నెమ్మది లేనివారై అగ్ని గంధకములచే బాధించబడుచుందురని; లోక సాంగత్యాన్ని, సాతాను పెత్తనాన్ని విస్మరించి గొఱ్ఱెపిల్ల రక్తములో తమ్ము తాము కడుగుకొనిన వారి పేర్లు జీవ గ్రంథములో వ్రాయబడి, దేవునితో రాజ్యమేలు చుందురని వ్రాయబడియున్నది. ప్రభువునందు మృతులైన వారు ధన్యులని, వారు తమ ప్రయాసలు మాని విశ్రాంతి పొందుదురని దేవుని వాక్యము సెలవిస్తున్నది (ప్రకటన 14:13). **(సశేషం)** –యన్. జయపాల్

**(ప్రకటన గ్రంథమంతటిపై ధ్యానించి, వ్రాయబడిన 'ప్రకటన సందేశములు' పుస్తకము కావలసినవారు రూ. 100/- పంపి, పొందగలరు!)**

సందేశం :

# నోవహు కుటుంబము

**"నోవహు అట్లు చేసెను. దేవుడు అతని కాజ్ఞాపించిన ప్రకారము యావత్తు చేసెను".** (ఆదికాండము 6:22)

ఒకరోజు దేవుడు నోవహుతో మానవ జాతి చెడుతనాన్ని గురించి చెప్పాడు. స్త్రీ పురుషుల వైఖరి, వారి ప్రవర్తన ఆయన హృదయాన్నెంతో గాయపరిచాయి. మనుష్యులందరిని నాశనం చేయడానికి తాను వరదను పంపించబోవుచున్నట్లు చెప్పాడు. అంతేకాదు నోవహు, తన కుటుంబము, తన పశువులు బ్రతికేలా ఒక ఓడను సిద్ధం చేసుకోమని చెప్పాడు (ఆదికాండము 6:1-21).

నోవహు దేవునిపై నమ్మకముంచినట్లు బైబిలు చెబుతున్నది (ఆది 6:22). నోవహు అంతకు ముందెన్నడూ వరదలు చూడలేదు. నలభై రోజులు వర్షం పడటం కూడా తాను ఎరుగడు. ఆయన దగ్గర ఈ రోజుల్లో మనకున్నట్లు వాతావరణపు హెచ్చరికలు యిచ్చే రేడియోలు, టెలివిజన్లు, ఇంటర్‌నెట్ లేవు. తను పూర్తిగా ఆధారపడవలసింది దేవుడు చెప్పిన మాట మీదనే!

దేవుడు ముందుగానే చెప్పినట్లు వరదలు రానే వచ్చాయి! నోవహు, తన కుటుంబం తప్ప మిగతా ప్రాణులంతా జల సమాధి అయిపోయాయి! నోవహు రోజులు మరల రాబోవుచున్నవి. వరదల కంటె గొప్ప ప్రమాదం, రక్షణ ఓడయైన క్రీస్తును తిరస్కరించేవారి కోసం కాచుకొని ఉంది. క్రీస్తు యేసు అను ఓడలోకి వస్తే నీవు, నీ కుటుంబము బ్రతుకును. నోవహు తన భార్యను, తన ముగ్గురు కుమారులను, ముగ్గురు కోడళ్ళను కూడా రక్షణలోనికి నడపించుకొన్నాడు. మరి మీ కుటుంబము రక్షించబడినదా? దేవుడు చెప్పినట్లు నీవు చేస్తే, నీ కుటుంబము రక్షింపబడును.

అవును ప్రియులారా! నోవహు ఓడ కట్టుకథ కాదు, ఇది నిజం! నోవహు ఓడ టర్కీ, ఇరాన్, రష్యా సరిహద్దుల మధ్య 5000 మీటర్ల ఎత్తులో ఉన్న అరారాతు పర్వతంపై మంచులో కూరుకుపోయి, ఇప్పటికీ ఉన్నదని కనుగొనిరి. టామ్ క్రోస్టర్ అనే పరిశోధకుడు, అతని బృందము 1975లో అరారాతు పర్వతంపై ఉన్న ఓడను కనుగొనిరి; అది చాలా విశాలముగా ఉండుట వలన, మంచులో కూరుకొని యుండుట వలన క్రిందకు తీసుకొని రావడం అసాధ్యమని చెప్పిరి.

నోవహు బోధించినట్లు జల ప్రళయం రావటం, ఓడలో ఉన్నవారు మాత్రమే రక్షింపబడటం సత్యమే! బైబిలు బోధిస్తున్నట్లు క్రీస్తు ఆగమనం, విశ్వాసుల ఆరోహణం; భూమియు, దాని మీద ఉన్న కృత్యములు కాలిపోవటం తథ్యం! మరి నీవు సిద్ధమా? (II పేతురు 3:1-7).

**- యన్. జయపాల్**

# శాస్త్రవేత్తలు – అన్వేషణలు

| | అన్వేషణ | శాస్త్రవేత్త | దేశం | సంవత్సరం |
|---|---|---|---|---|
| 1. | పేపర్ | – | చైనా | 105 |
| 2. | ప్రింటింగ్ ప్రెస్ | జాన్‌గూటెన్‌బర్గ్ | జర్మనీ | 1455 |
| 3. | గడియారము | బరోలోమ్యూన్‌మ్యాన్ | ఇటలీ | 1462 |
| 4. | వాటర్ క్లోసెట్ | జె. హర్రింగ్‌టన్ | బ్రిటన్ | 1589 |
| 5. | మైక్రోస్కోప్ | జడ్. జాన్‌సన్ | హాలెండ్ | 1590 |
| 6. | టెలిస్కోప్ | గలీలియో గెలిలీ | ఇటలీ | 1593 |
| 7. | థర్మామీటర్ | హన్స్ లిప్థర్‌షే | హాలెండ్ | 1608 |
| 8. | స్లైడ్ రూల్ | విలియం ఆట్రెడ్ | బ్రిటన్ | 1621 |
| 9. | క్లాక్ పెండ్యూలమ్ | క్రిస్టియన్ హ్యూజన్స్ | హాలెండ్ | 1656 |
| 10. | స్టీమ్ ఇంజన్ | థామస్ సెవరి | బ్రిటన్ | 1698 |
| 11. | స్టీమ్ ఇంజన్ పిస్టన్ | థామస్ న్యూకోమెన్ | బ్రిటన్ | 1712 |
| 12. | మెషిన్ గన్ | జేమ్స్ పుకుల్ | బ్రిటన్ | 1718 |
| 13. | స్టీమ్ షిప్ | జె.సి. పెరియర్ | ఫ్రాన్స్ | 1775 |
| 14. | సబ్‌మెరైన్ | డేవిడ్ బుష్‌నెల్ | అమెరికా | 1776 |
| 15. | కంటి అద్దాలు | బెంజిమిన్ ఫ్రాంక్లిన్ | అమెరికా | 1780 |
| 16. | బెలూన్ | జాక్వెస్ జోసెఫ్ మాంట్ గోలర్ | ఫ్రాన్స్ | 1783 |
| 17. | మరమగ్గము | కార్ట్‌రైట్ | బ్రిటన్ | 1785 |
| 18. | లూమ్ పవర్ | ఇ. కార్ట్‌రైట్ | బ్రిటన్ | 1785 |
| 19. | టెలిగ్రాఫ్ | యమ్. లామండ్ | ఫ్రాన్స్ | 1787 |
| 20. | గ్యాస్ లైటింగ్ | విలియం మర్డక్ | బ్రిటన్ | 1792 |
| 21. | పేరాచ్యూట్ | ఎ. గార్నరిన్ | ఫ్రాన్స్ | 1797 |
| 22. | బ్యాటరీ | అలెస్సాండ్రో ఓల్గా | ఇటలీ | 1800 |
| 23. | టైప్‌రైటర్ | పెల్లగ్రిన్‌టర్రీ | ఇటలీ | 1808 |
| 24. | రైలు ఇంజన్ | రిచర్డ్ ట్రివితిక్ | బ్రిటన్ | 1804 |
| 25. | డెంటల్ ప్లేట్ | ఆంథోనీ ఎ. ప్లాన్‌స్టన్ | అమెరికా | 1817 |
| 26. | కంప్యూటర్ | అలన్ ట్యూరించ్ | బ్రిటన్ | 1824 |
| 27. | అగ్గిపుల్ల | జాన్ వాకర్ | బ్రిటన్ | 1824 |
| 28. | కుట్టు మిషన్ | బర్తెటెమి తిమ్మోనియర్ | ఫ్రాన్స్ | 1829 |
| 29. | ట్రాన్స్‌ఫార్మర్ | మైఖేల్ ఫారడే | బ్రిటన్ | 1831 |

| | | | | |
|---|---|---|---|---|
| 30. | డైనమో | హైపొలైట్ పిక్సీ | ఫ్రాన్స్ | 1832 |
| 31. | గాల్వనో మీటర్ | ఆండ్రీమేరీ అంపియర్ | ఫ్రాన్స్ | 1834 |
| 32. | ప్రొపెల్లర్ షిప్ | ఫ్రాన్సిస్ స్మిత్ | బ్రిటన్ | 1837 |
| 33. | టెలిగ్రాఫ్ కోడ్ | సామ్యూల్ ఎఫ్.బి. మోర్స్ | అమెరికా | 1837 |
| 34. | సైకిల్ | కిర్క్ పాట్రిక్ మాక్మిలన్ | బ్రిటన్ | 1839-40 |
| 35. | రబ్బర్ (వల్కనైజ్డ్) | ఛార్లెస్ గుడ్ ఇయర్ | అమెరికా | 1841 |
| 36. | నైట్ క్లబ్ | - | ఫ్రాన్స్ | 1843 |
| 37. | రబ్బర్ టైర్ | థామస్ హాంకాక్ | బ్రిటన్ | 1846 |
| 38. | సేఫ్టీ పిన్ | వాల్టర్ హంట్ | అమెరికా | 1849 |
| 39. | రిఫ్రిజిరేటర్ | జేమ్స్ హరిసన్ | అమెరికా | 1850 |
| 40. | పార్సిలీన్ | సర్ ప్యాడిక్ | చైనా | 1851 |
| 41. | లిఫ్ట్ | ఎలీషా ఓటీస్ | అమెరికా | 1852 |
| 42. | గ్లైడర్ | సర్ జార్జ్ కేలీ | బ్రిటన్ | 1853 |
| 43. | బున్‌సెన్ బర్నర్ | ఆర్.విల్‌హెల్మ్ ఓన్‌బున్‌సెన్ | జర్మనీ | 1855 |
| 44. | దొంగను పట్టించే అలారం | ఎడ్విన్ హంట్ | అమెరికా | 1858 |
| 45. | సెల్యులాయిడ్ | అలెగ్జాండర్ పార్కర్ | బ్రిటన్ | 1861 |
| 46. | పాశ్చరైజేషన్ | లూయిస్ పాశ్చర్ | ఫ్రాన్స్ | 1867 |
| 47. | ఎలక్ట్రిక్ మోటార్ (డి.సి.) | జెనోబీ గ్రామ్ | బెల్జియం | 1873 |
| 48. | మైక్రోఫోన్ | అలెగ్జాండర్ గ్రాహంబెల్ | అమెరికా | 1876 |
| 49. | టెలిఫోన్ | అలెగ్జాండర్ గ్రాహంబెల్ | అమెరికా | 1876 |
| 50. | కార్బోరేటర్ | గాట్‌లిబ్ డెయిమ్‌లెర్ | జర్మనీ | 1876 |
| 51. | ఎలక్ట్రిక్ వెల్డింగ్ | ఎలీషా థామస్ | అమెరికా | 1877 |
| 52. | గ్రామ్‌ఫోన్ | థామస్ అల్వా ఎడిసన్ | అమెరికా | 1878 |
| 53. | ఎలక్ట్రిక్ బల్బ్ | థామస్ అల్వా ఎడిసన్ | అమెరికా | 1879 |
| 54. | క్యాష్ రిజిస్టర్ | జేమ్స్ రిట్టీ | అమెరికా | 1879 |
| 55. | ఇస్త్రీపెట్టె | సిలే | అమెరికా | 1882 |
| 56. | స్కై స్క్రేపర్ | బేరన్ జెన్నీ | అమెరికా | 1882 |
| 57. | రేయాన్ | సర్. జోసెఫ్ స్వేన్ | బ్రిటన్ | 1883 |
| 58. | మోటార్ సైకిల్ | డైమ్‌లర్ ఆఫ్ కాన్‌స్టాట్ | జర్మనీ | 1885 |
| 59. | ఫిల్మ్ (మూవింగ్ ఔట్‌లైన్స్) | టూయిస్ ప్రిన్స్ | ఫ్రాన్స్ | 1885 |
| 60. | బాల్ పాయింట్ పెన్ | జోన్‌టేడ్ | అమెరికా | 1888 |
| 61. | పెట్రోల్ కార్ | కార్ల్‌బెంజ్ | జర్మనీ | 1888 |
| 62. | ఎలక్ట్రిక్ మోటార్ (ఏ.సి.) | నికోలాటెస్‌లా | అమెరికా | 1888 |
| 63. | ఫోటోగ్రఫీ (ఫిల్మ్‌పై) | జాన్ కార్బట్ | అమెరికా | 1888 |

| | | | | |
|---|---|---|---|---|
| 64. | జిప్ ఫాస్ట్‌నెర్ | డబ్ల్యు.ఎల్. జడ్సన్ | అమెరికా | 1891 |
| 65. | షిప్ టర్బైన్ | హన్‌సర్ సి. పార్సన్స్ | బ్రిటన్ | 1894 |
| 66. | సేఫ్టీ రేజర్ | కింగ్ సి. గిల్లెట్ | జర్మనీ | 1895 |
| 67. | డీసెల్ ఇంజన్ | రోడాల్ డీసెల్ | జర్మనీ | 1895 |
| 68. | ఎక్స్-రే | రాంట్‌జెన్ | జర్మనీ | 1895 |
| 69. | సినిమా | నికోలస్ & జిన్ టూమియర్ | ఫ్రాన్స్ | 1895 |
| 70. | లౌడ్ స్పీకర్ | హోరేస్ షార్ట్ | బ్రిటన్ | 1900 |
| 71. | విమానము | రైట్ సోదరులు | బ్రిటన్ | 1903 |
| 72. | బట్టలు ఉతికే మిషన్ | హోర్‌లే మిషన్ కంపెనీ | అమెరికా | 1907 |
| 73. | సెల్లోఫోనేన్ | డా॥ జె. బ్రాండెన్ బర్గర్ | స్విట్జర్లాండ్ | 1908 |
| 74. | నియోన్ ల్యాంప్ | జార్డెస్ క్లౌడ్ | ఫ్రాన్స్ | 1910 |
| 75. | గైరో కంపాస్ | ఎల్మర్ ఎ స్పెర్రీ | అమెరికా | 1911 |
| 76. | సెల్ఫ్ స్టార్టర్ | ఛార్లెల్ ఎఫ్. కెటెరింగ్ | అమెరికా | 1911 |
| 77. | స్టెయిన్‌లెస్ స్టీల్ | హరీబ్రియర్‌లీ | బ్రిటన్ | 1913 |
| 78. | ట్యాంకర్ (యుద్ధ) | సర్ ఎర్నస్ట్ స్వింగ్‌టన్ | బ్రిటన్ | 1914 |
| 79. | రాడార్ | టేలర్ & లియో సి. యంగ్ | అమెరికా | 1922 |
| 80. | ఫిల్మ్ (టాకింగ్) | జె. ముస్సోరీ & హెచ్. వోట్ | జర్మనీ | 1922 |
| 81. | ఫిల్మ్ (మ్యూజికల్ సౌండ్) | డా॥ ఫారెస్ట్ | అమెరికా | 1923 |
| 82. | ఫౌంటెన్ పెన్ | లూయిస్ ఇ. వాటర్‌మేన్ | అమెరికా | 1923 |
| 83. | హెలీకాప్టర్ | ఎటిన్నీ ఓమిషన్ | ఫ్రాన్స్ | 1924 |
| 84. | పోర్ట్‌లాండ్ సిమెంట్ | జోసెఫ్ ఆస్పిడిన్ | బ్రిటన్ | 1924 |
| 85. | టెలివిజన్ | పి.టి. ఫ్రాన్స్‌వర్త్ | అమెరికా | 1927 |
| 86. | రబ్బర్ ఫోమ్ | డన్‌లప్ రబ్బర్ కంపెనీ | బ్రిటన్ | 1928 |
| 87. | టెర్లీన్ | జె.ఆర్. వింగ్‌ఫీల్డ్ & ఎల్. డిక్‌సన్ | బ్రిటన్ | 1931 |
| 88. | లాండ్‌రేట్ | జె.ఎఫ్. కాన్‌ట్రెల్ | అమెరికా | 1934 |
| 89. | జెట్ విమానం | సర్ ఫ్రాంక్ విట్టిల్ | బ్రిటన్ | 1937 |
| 90. | నైలాన్ | డా॥ వేలెస్ హెచ్. కేరోథేర్స్ | అమెరికా | 1937 |
| 91. | ట్రాన్సిస్టర్ | బర్డీన్ షాక్‌లే & బ్రట్లైన్ | అమెరికా | 1948 |
| 92. | హోవర్ క్రాఫ్ట్ | సి.యస్. కాక్‌రెల్ | బ్రిటన్ | 1955 |
| 93. | రిమోట్ | రాబర్ట్ ఆడ్లర్ | అమెరికా | 1956 |
| 94. | లేసర్ కిరణాలు | టి.హెచ్. మైమా | అమెరికా | 1960 |
| 95. | రికార్డ్ లాంగ్ ప్లేయింగ్ | డా॥ పీటర్ గోల్డ్ మార్క్ | అమెరికా | 1968 |
| 96. | మైక్రో ప్రాసెస్సర్ | రాబర్ట్ నోయ్స్ & గోర్డన్ మూర్ | అమెరికా | 1971 |
| 97. | రూబిక్ క్యూబ్ | ప్రొ॥ ఎమోర్యూబిక్ | హంగేరీ | 1975 |

| | | | | |
|---|---|---|---|---|
| 98. | విండ్ మిల్ | పెర్సియన్ కార్న్ గ్రైండింగ్ | - | క్రీ.పూ. 600 |
| 99. | గ్లాస్ వేర్ | ఈజిప్ట్ & మెసపొటోమియా | - | క్రీ.పూ. 1500 |
| 100. | వీల్ | సుమేరియన్ సివిలైజేషన్ | - | క్రీ.పూ. 3300 |
| 101. | మేప్స్ | సుమేరియా | - | క్రీ.పూ. 3800 |

యేసుప్రభువు 'నేను లోకమునకు వెలుగైయున్నానని' చెప్పారు. భక్తి సంబంధమైన వెలుగే గాక, జ్ఞాన సంబంధమైన వెలుగును కూడా మానవులకు ప్రసాదించారు. ఆయనను ప్రార్థించేవారిపై ఈ జ్ఞానజ్యోతిని ఉదయింపజేసినందున వారు ఇన్ని ఆవిష్కరణలు కనుగొనగలిగినారు. **- ఎడిటర్**

# లాగుడు బండి క్రైస్తవులు

కొందరు ఎప్పుడూ ఎవరో ఒకరు ముందుకు లాగుతుంటేనే గాని సాగరు! ఆలయానికి వెళ్దాం రమ్మంటేనే గాని రారు, ప్రార్థన చేసుకోమని చెప్తేనే గాని చేసుకోరు!

ఆధ్యాత్మిక జీవితంలో బలం లేనివారు అస్తమానం ఎవరి మీదో ఒకరి మీద ఆధారపడుతూ జీవిస్తారు. 'కుక్క తోక వంకర' అన్నట్లుగా, కొందరు తమ వంకర తనాన్ని సరిచేసుకోరు! కుక్క తోకను లాగి పట్టుకొన్నంతసేపు తిన్నగా ఉండి, వదిలిన వెంటనే ముడుచుకుపోయే రీతిగా; కొందరు విశ్వాస జీవితంలో ఎవరో ఒకరు వారితో కూడా ఉండి నడిపిస్తున్నంత సేపు, తరుముచున్నంత సేపు, హెచ్చరిస్తున్నంత సేపు బాగానే ఉందురు గాని; వారి ఒంటరి స్థితిలో నిర్ణయాలు చేయవలసి వచ్చినప్పుడు తిన్నగా ఉండరు!

యేసు ప్రభువు మంచి గొఱ్ఱెల కాపరిగా ఈ లోకములోనికి వచ్చెను. నా గొఱ్ఱెలు నా స్వరము విని, నన్ను వెంబడించుననెను (యోహాను 10:27). అయితే ఈనాడనేకులు దేవుని ప్రేమను రుచి చూచిన తరువాత, అనేక ఆశీర్వాదాలు అనుభవించిన తరువాత గొఱ్ఱెల వంటి స్వభావాన్ని వదలి, గొడ్లవంటి వారవుతున్నారు. గొడ్డ కాపరి ముందు నడిస్తే, గొడ్లు వెంబడించవు గాని; గొడ్డ కాపరి వెనుక నుండి వాటిని బాదుచు, తరిమితేనే గాని ముందుకు సాగవు! ఈనాడనేకుల విశ్వాస జీవితము ఈలాగునే ఉన్నది.

"యెల్లప్పుడును నేర్చుకొనుచున్నను, సత్య విషయమైన అనుభవ జ్ఞానము ఎప్పుడును పొందలేని స్థితిలో ఉన్నారు... గనుక వీరు ఇక ముందుకు సాగరు" (II తిమోతి 3:6-9) అని బైబిలు చెప్పుచున్నది. **- యన్. జయపాల్**

# అతడు నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు!

**"మోషే నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు".** (సంఖ్యా 12:7)

నమ్మకస్థులైనవారి కొరకు ప్రభువు ఎదురుచూస్తున్నాడు (కీర్తన 101:6). ఆయన యొక్క గొప్ప ధననిధిని, శక్తిని, సకల ఆశీర్వాదములను భూజనులందరికి పంచి యిచ్చుటకు నమ్మకస్థులైనవారికి అప్పగించవలెనని ఆయన ఎదురుచూస్తున్నాడు.

దేవుడు మోషేను కనుగొనెను. 'మోషే నా ఇల్లంతటిలో నమ్మకమైనవాడు' అని సాక్ష్యమిచ్చెను. మోషే దేవుడు తన కప్పగించిన పనిని నమ్మకముగా చేసెను. తనకు అప్పగించిన అధికారమును దుర్వినియోగపరచుకొనలేదు. ప్రత్యక్షపు గుడారము కట్టుట కొరకు ఎంతో వెండి బంగారములను, విలువైన వస్తువులను అతని కప్పజెప్పినప్పుడు వాటన్నిటిలో నమ్మకస్థునిగా ఉండెను (నిర్గమ 35-40 అధ్యాయములు).

ఈ దినములలో ప్రభువు మనలను నమ్మి ఎన్నో ఆత్మ వరాలను, నిధులను, సంఘమును, ఆత్మలను మనకు అప్పగించియుండగా; మనము ఎంతవరకు నమ్మకస్థులమై యున్నాము? దేవుని మాట ప్రకారము మనమన్ని విషయములలో నడుచుకొనుచున్నామా? దేవుడు మనలను నమ్మి ఇచ్చిన తలాంతులను ఆత్మల రక్షణార్థమై వాడి ప్రభువును మహిమపరచుచున్నామా? దేవుడు మనకిచ్చిన డబ్బు, సమయము, రక్షణ అను తలాంతులను ఎలా వాడుచున్నాము?

కొంచెములో నమ్మకముగా ఉండనివారికి గొప్పవాటిని ఎవరు అప్పగించెదరు? "మిక్కిలి కొంచెములో నమ్మకముగా ఉండువాడు ఎక్కువలోను నమ్మకముగా ఉండును. మిక్కిలి కొంచెములో అన్యాయముగా ఉండువాడు ఎక్కువలోను అన్యాయముగా ఉండును. కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయములో నమ్మకముగా ఉండని యెడల సత్యమైన ధనమును ఎవరు మీ వశము చేయును? మీరు పరుల సొమ్ము విషయములో నమ్మకముగా ఉండని యెడల మీ సొంతమైనది మీకు ఎవడిచ్చును?" (లూకా 16:10-12).

కాబట్టి నా ప్రియ సహోదరులారా! మిక్కిలి కొంచెములో నమ్మకస్థులమై యుండి, - 'భళా, నమ్మకమైన మంచి దాసుడా, నీవు కొంచెములో నమ్మకముగా ఉంటివి గనుక నిన్ను అనేకమైనవాటి మీద నియమించెదను; నీ యజమానుని సంతోషములో పాలుపొందుమని' అనిపించుకొందము! మన తలాంతులను దుర్వినియోగపరచి, అపనమ్మకస్థులతో పాలుపొంది, అగ్ని గంధకములతో మండు గుండములో అహర్నిశలు అలమటించకుండా జాగ్రత్తపడదాం! (మత్తయి 25:14,30)

నేడే ప్రభువు యొద్ద మన అపనమ్మకత్వమును ఒప్పుకొని, 'ప్రభువా, నన్ను మరణము వరకు నమ్మకస్థునిగా చేయుమని' ప్రార్థించుదము గాక! **- యన్. జయపాల్**

# యేసు పద్ధతా? లోక పద్ధతా?



యేసు శిష్యుల జాబితాలో పేతురు పేరు మొదట ఉంది, ఇస్కరియోతు యూదా పేరు చివర ఉంది. ఇద్దరి వ్యక్తిత్వాలలో ఎంతో వ్యత్యాసం ఉంది. 'ప్రభువును గాయపరిచానే' అని పేతురు ఏడిస్తే, 'నాకు గాయమైందే' అని ఇస్కరియోతు యూదా ఏడ్చాడు. ప్రభువు గద్దింపునకు పేతురు లోబడ్డాడు, యూదా అలా లోబడలేదు. పైగా ప్రభువును అప్పగించటానికి సిద్ధమయ్యాడు.

యేసుక్రీస్తు బోధలలో ఎక్కువ భాగం ఆర్థిక అంశాలే ఉన్నాయి. నాలుగు సువార్తల్లో పరిశోధించి చూడండి! పౌలు యేసు యొక్క ఆర్థిక దృక్పథాన్ని అలవరచు కొన్నాడు. పరిశుద్ధాత్మ పౌలులో యేసు మనస్తత్వాన్ని నింపాడు. ఇస్కరియోతు ఆర్థిక దృక్పథం స్వార్థపూరితమైనది. ప్రభువు ఏమన్నాడు? ఉచితంగా పొందారు, ఉచితంగా ఇవ్వండి. పనివాడు ఆహారానికి పాత్రుడు. పౌలు ఏమన్నాడు? నాకేమీ కొదువ లేదు. నేను ఏ స్థితిలో ఉన్నా, ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండటం నేర్చుకొన్నాను.

దీన స్థితి, సంపన్న స్థితి – రెండూ ఒక్కటే! ప్రతి విషయంలో, అన్ని కార్యాలలో; కడుపు నిండియుండటం, ఆకలిగొనియుండటం; సమృద్ధి, లేమి; సర్వత్ర, సమ దర్శనం! నన్ను బలపరచువానియందే నేను సమస్తమూ చేయగలను. పుచ్చుకోవటం, ఇవ్వటం అనే అంశాలు మనం ప్రభువు దగ్గరే నేర్చుకున్నాము. ఇచ్చేవారికి ఎక్కువ ఆశీర్వాదం. మీ లెక్కకు విస్తార ఫలం వస్తుంది. నాకు సర్వ సమృద్ధి! దానశీలం మనోహరమైన సువాసన, దేవునికి ప్రీతికరమైన యాగం! దేవుడు క్రీస్తునందు మహిమలో ప్రతి అవసరమూ తీరుస్తాడు (ఫిలిప్పీ 4:19).

ఆర్థిక బంధకాలు విశ్వాసులకు ఉండకూడదు. ధన దాస్యం అనాధ్యాత్మికం! ప్రభువునే నమ్మాలి! ఐశ్వర్యాన్ని నమ్మకూడదు. దేవునితో మనం స్వేచ్ఛగా మాట్లాడవచ్చు! గాని విశ్వాసులు అర్థవంతమైన ప్రశ్నలే అడుగుతారు. న్యాయంగా డబ్బు బాగా సంపాదించండి. ధారాళంగా ఇవ్వండి. లోకం పద్ధతులు మనవి కావు, అవి అభ్యసించవద్దు! లోకం విలువలు మనవి కావు. ప్రభువు నేర్పిన విలువలను మనం గుర్తించాలి! ముఖ్యంగా డబ్బు విషయంలో యేసు పద్ధతులే పాటించాలి! 'నలుగురితో పాటు నేనూ' అనే పద్ధతి మంచిది కాదు.

యేసు శిష్యులది ఆధ్యాత్మిక విప్లవ ధోరణి! క్రైస్తవ విశ్వాసికి డబ్బు ఉంటే దానిని ఖర్చు చేయటంలో సృజనాత్మక పద్ధతులు కనుక్కోవాలి! బీదల పక్షాన నిలవాలి! ఎవరూ అనుకోనంతగా ఇచ్చి అందరినీ ఆశ్చర్యపరచాలి! దశమ భాగాలతో ఆగిపోవద్దు. దానికి మించి ఇవ్వాలి! లోక రాజ్యానికి ఇది తలక్రిందులుగా కనిపిస్తుంది. అయితే దేవుని దృష్టిలో ఇహలోక రాజ్యమే తల్లక్రిందులు!

**– కీ.శే. ఆచార్య ఆరార్కె మూర్తి, ఆరార్కె మ్యూజింగ్స్ అనుదిన భావ తరంగాలు**

వనితలకు: బిడ్డల కొరకు గొప్ప ఆశలు కలిగిన

# జెబెదయి కుమారుల తల్లి

**"అప్పుడు జెబెదయి కుమారుల తల్లి తన కుమారులతో ఆయన యొద్దకు వచ్చి నమస్కారము చేసి యొక మనవి చేయబోగా-నీవేమి కోరుచున్నావని ఆయన అడిగెను. అందుకామె-నీ రాజ్యమందు ఈ నా యిద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను ఒకడు నీ యెడమవైపునను కూర్చుండ సెలవిమ్మని ఆయనతో అనెను".** (మత్తయి 20:20,21)

జెబెదయి అనగా 'దేవుని వరము' అని అర్థము! ఇతడు గలిలయ ప్రాంతములో జాలరి! ఇతడు దోనెలు, పనివారు కలిగిన సంపన్నుడైన జాలరి! ప్రభువు, తనను వెంబడించుటకు పిలిచిన యోహాను, యాకోబులు ఇతని కుమారులు. ఇతని భార్య పేరే సలోమే (మార్కు 15:40; 16:1). సలోమే అనగా 'సమాధానము' అని అర్థము! ఈమె 'జెబెదయి కుమారుల తల్లి' అని ఎక్కువగా పిలువబడినది (మత్తయి 20:20; 27:56). ఎందుకంటే ఆ దినములలో సలోమే అను పేరు కలిగిన మరొక స్త్రీ ఉండెను. ఆమె హేరోదియ కుమార్తె!

హేరోదియ ఒక భయంకరమైన వ్యక్తిగా; తన భర్తను విడిచి, భర్త సహోదరుని చేరినదిగా; 'నీ సహోదరుని భార్యను చేర్చుకొనుట నీకు మంచిది కాదని' హెచ్చరించిన నీతిమంతుడు, పరిశుద్ధుడునైన బాప్తిస్మమిచ్చు యోహానుపై పగబట్టి; తన కుమార్తెను హేరోదు యెదుట నాట్యమాడి, మురిపించునట్లుగా చేసెను. బాప్తిస్మమిచ్చు యోహాను తల నరికించి, పళ్ళెములో పెట్టి నా కిప్పించుమన్న భయంకరమైన కోరికను కోరుటకు ఈ తల్లియైన హేరోదియ తన కుమార్తెయైన సలోమేను ప్రేరేపించెను. సలోమే అనగా 'సమాధానము' అని పేరు పెట్టుకొనిన ఆ కుమార్తె తన తల్లిచే ప్రేరేపించబడి, హీనమైన కోరికను కోరి, ఘోరమైన పాపానికి గురియైనది.

తన బిడ్డను స్వార్థము కొరకు వాడుకొని, బిడ్డచే నీచమైన కోరికను కోరించిన హేరోదియకు, బిడ్డలను వెంటబెట్టుకొని ప్రభువు దగ్గరకు వెళ్ళి గొప్ప కోరికను కోరుకొన్న జెబెదయి కుమారుల తల్లికి ఎంత వ్యత్యాసముందో చూడండి! నీవు హేరోదియ వంటి నీచమైన తల్లిగా ఉండక, జెబెదయి కుమారుల తల్లి వంటి ఘనమైన తల్లిగా ఉండుము!

ఈ సలోమే ప్రభువును ప్రేమించిన మంచి విశ్వాసిగాను, అణకువ కలిగిన భార్యగాను, బిడ్డల భవిష్యత్ కొరకు గొప్ప తలంపులు కలిగిన తల్లిగాను ఉన్నది. ఈమె తన ఇద్దరు కుమారులను ప్రభువుకు అప్పజెప్పుటయే గాక, ఈమె ఆర్థికంగా కూడా ప్రభువు పరిచర్యను పోషించినట్లు చరిత్ర చెప్పుచున్నది (లూకా 8:2).

ఈనాడనేకులు తమ కుమారులు సంపాదించి, వారికివ్వాలని; తమ బిడ్డలు దేవుని సేవ చేయుట ద్వారా తమకేమి లాభము దొరుకునాయని ఆలోచించెదరు. గాని, సలోమే తన కుమారులు దేవుని సేవ చేయుట గొప్ప భాగ్యమని యెంచెను. సలోమే తన కుమారులు దేవుని సేవలో ఉన్నారు, అదే నాకు ఆశీర్వాదము, చాలు అని కూర్చోలేదు గాని; ఆమె కూడా ప్రభువు పరిచర్యలో ఉపచారము చేయుచు, ఆయనను వెంబడించుచు, ఆయన బోధలు విని ఆధ్యాత్మికంగా మేలు పొందుచుండెను.

యేసుక్రీస్తు తన సిలువ, మరణ, పునరుత్థానముల గురించి బోధించినప్పుడు; పరలోకమును, పరలోక మహిమను గుర్తించిన సలోమే, తన కుమారులు దేవుని రాజ్యములో గొప్పవారిగా ఉండాలని ఆశించెను. ఈనాడు అనేకమంది తల్లులు తమ బిడ్డలు ఈ లోకంలో డాక్టర్లుగా, ఇంజినీర్లుగా ఉన్నత పదవుల్లో ఉండాలని ఆశిస్తున్నారే గాని; ఈ లోకము, దాని ఆశ గతించిపోవునని; ఈ లోక ఆధిక్యతలు అల్పకాలమైనవి, అశాశ్వతమైనవి అని గుర్తించుట లేదు.

ఒక ఉన్నతమైన తల్లి, తన బిడ్డల కొరకు ఉన్నతమైన ఆశలు కలిగియుంటుంది. అటువంటి ఆశ కలిగిన జెబెదయి కుమారుల తల్లి ఒకసారి తన కుమారులతో ప్రభువు దగ్గరకు వచ్చి, నమస్కారము చేసెను. అప్పుడు ప్రభువు–నీవేమి కోరుచున్నా వని అడిగెను. అందుకామె– నీ రాజ్యమందు ఈ నా ఇద్దరు కుమారులలో ఒకడు నీ కుడివైపునను, ఒకడు నీ ఎడమవైపునను కూర్చుండ సెలవిమ్మని అడిగెను. నీకేమి కావాలని అడిగినప్పుడు 'నా కుమారులు గొప్ప బిషప్పులవ్వాలనో, నా బిడ్డలకు అది కావాలి ఇది కావాలనో' ఆమె అడుగలేదు గాని, దేవుని రాజ్యములో వారు గొప్పవారుగా ఉండాలని కోరెను.

ఈమె యేసుక్రీస్తు ప్రభువని, ఆయన మరణించి తిరిగి లేచునని, ఆయన దేవుని కుడి పార్శ్వమున కూర్చుండునని; రాజులకు రాజుగా, ప్రభువులకు ప్రభువుగా రాజ్యమేలునని నమ్మెను. ఆ రాజ్యము శాశ్వతమైనదని నమ్మిన జెబెదయి కుమారుల తల్లి, తన కుమారులు తన ప్రభువుతో కూడా రాజ్యమేలాలని కోరెను.

సలోమే మూఢ నమ్మకాలతో దేవునికేవో కొన్ని ముడుపులు చెల్లిస్తే దీవెన పొందవచ్చు అన్న స్త్రీగా లేదు గాని; నిజమైన విశ్వాసిగాను, ఘనమైన స్త్రీగాను ఉన్నది. ఈనాడనేకులు దేవునికి కొన్ని కానుకలు, అర్పణలు యిస్తే చాలని అనుకొంటున్నారు గాని; తమ జ్యేష్ఠ కుమారుడు దేవుని సొత్తని, గర్భఫలము ఆయనిచ్చు బహుమానమని, కుమారులు ఆయన అనుగ్రహించు స్వాస్థ్యమని గుర్తించకున్నారు.

ప్రతి తల్లి తన జ్యేష్ఠ కుమారుని దేవుని పరిచర్యకు సిద్ధపరిస్తే ఈనాడు సువార్త విననివారింకా లోకములో ఉందురా? ప్రతి తల్లి తన గర్భఫలము దేవుని బహుమానమని, కుమారులు ఆయనిచ్చిన స్వాస్థ్యమని గుర్తించి; దేవుని కొరకు

తమ బిడ్డలను పెంచి, పెద్ద చేసి దేవుని సొత్తైన ప్రజగా తీర్చిదిద్దితే లోకములో నీతి న్యాయములకు కొరత ఉండునా? 'నా తల్లి వంటి తల్లి అందరికీ ఉంటే ఈ లోకములో న్యాయస్థానాలు, చెరసాలలు అవసరమే లేదు' అన్నాడు డి.యల్. మూడీ అనే భక్తుడు!

ఈనాడనేకమంది తల్లులు తమ బిడ్డలకు మంచి వంటలు వండిపెట్టి, చక్కటి బట్టలు కుట్టించి, మంచి చదువులు చెప్పించి, పెళ్ళిళ్ళు చేస్తే చాలనుకొంటున్నారు గాని; తమ బిడ్డలు ఆధ్యాత్మికంగా వర్ధిల్లాలని; ఇహమందు, పరమందు దేవుని దృష్టిలో గొప్పవారై యుండాలని ఆశించుట లేదు. అయితే సలోమే యొక్క ఉన్నత మైన కోరికను చూడండి! 'ఈ నా కుమారులిద్దరు నీ రాజ్యములో నీ కుడి ప్రక్కన, నీ ఎడమ ప్రక్కన కూర్చుండాలి' అని ప్రభువును కోరినది. అందుకు ప్రభువు 'నేను త్రాగబోవు గిన్నెలోనిది మీరు త్రాగగలరా? అయినను నా కుడి వైపునను, నా ఎడమ వైపునను కూర్చుండనిచ్చుట నా వశములో లేదు; నా తండ్రి చేత ఎవరికి సిద్ధపరచబడెనో వారికే అది దొరుకునని చెప్పెను' (మత్తయి 20:22,23).

పరలోకంలో గొప్పవారిగా ఉండటం ఒక వరం కాదు గాని; ఎవడు దేవుని ఆజ్ఞలను గైకొని, ఆయన చిత్తానుసారంగా జీవించునో వాడే పరలోక రాజ్యంలో గొప్పవాడు (మత్తయి 5:19). గొప్పవాడై యుండగోరువాడు పరిచారకుడై యుండ వలెను (మత్తయి 20:26). ఎవడు క్రీస్తు కొరకు నిందను, శ్రమను భరించి; మరణము వరకు నమ్మకముగా ఉండునో వాడే పరలోక రాజ్యములో గొప్పవాడు అని ప్రభువు చెప్పెను.

ఈ తల్లి ప్రార్థన, కోరికల ప్రకారమే తన కుమారులైన యాకోబు, యోహాను లకు జరిగెను. యేసుప్రభువు సిలువ మరణము పొంది, పునరుత్థానుడై, ఆకాశము నకు ఆరోహణమై, సింహాసనాసీనుడైన తరువాత ఆయన శిష్యులలో మొట్టమొదట హతసాక్షియైనవాడు యాకోబు (అపో. కార్య. 12:1,2); ఆ తరువాత మిగిలిన శిష్యులందరూ హతసాక్షులైరి! చిట్టచివరిగా యోహాను అనేక శ్రమలు భరించి, ప్రకటన గ్రంథము రచించి, నిండు వృద్ధాప్యములో మరణించి ప్రభువు సన్నిధి కేగెను. ప్రభువు సింహాసనము చుట్టూ (గుండ్రంగా) వేయబడిన పన్నెండు సింహాసనా లలో మొదటి హతసాక్షియైన యాకోబు ప్రభువుకు ఒకవైపున కూర్చుండగా, చివరిగా మరణించిన యోహాను ప్రభువు సింహాసనమునకు మరొక వైపున కూర్చుండెనని చెప్పుదురు.

సలోమే అనబడిన ఈ జెబెదయి కుమారుల తల్లి తన బిడ్డల కొరకు గొప్ప కోరికలు కలిగియుండెను. తానును ప్రభువును వెంబడిస్తుండెను. యేసుక్రీస్తు లోక పాపముల కొరకు సిలువ వేయబడుచున్నాడని నమ్మిన సలోమే సిలువ చెంత ఉండెను (మార్కు 15:40). సిలువ వేయబడిన క్రీస్తు పునరుత్థానుడగునని విశ్వసించిన సలోమే, వేకువనే సమాధి యొద్దకు వచ్చిన స్త్రీలతో ఉండెను (మార్కు 16:1). గొప్ప తల్లిగా, మంచి విశ్వాసిగా జెబెదయి కుమారుల తల్లి అనబడే ఈ సలోమే కొనియాడబడెను.

– యన్. జయపాల్

131వ కీర్తనలోని

# ముచ్చటైన మూడు విషయాలు!

**మొదటిగా - "నాకు అందనివాటి యందైనను గొప్పవాటి యందైనను నేను అభ్యాసము చేసికొనుట లేదు".** (కీర్తన 131:1)

ఈనాడనేకులు అందని వాటి కొరకు తాపత్రయపడుచు వాటిని ఎలా సంపాదించుకోవాలా? అని ఆరాటపడుచున్నారు. తమ దగ్గర డబ్బు లేకున్నను అప్పులు చేసి అనవసరమైనవెన్నో కొనుక్కొని, ఆ అప్పులు తీర్చలేక అవస్థలు పడుతున్నారు. 'వెనకటికి ఒకడు నాడా దొరికిందని గుఱ్ఱం కొన్నాడట!' అట్లాగే అప్పుచేసి విలువైన ఆభరణాలను, వస్త్రాలను కొని ఆర్భాటంగా పెళ్ళిళ్ళు చేయటం; అప్పులతో, ఆడంబరాలతో నిండిన గృహాలు నిర్మించుకోవటం నేటి మానవులకు పరిపాటి అయిపోయింది. 'మింగ మెతుకు లేకపోయినా, మీసాలకు సంపెంగ నూనె' అన్నట్లు కుటుంబాన్ని పోషించడానికే సరైన ఆదాయం లేనివారు కూడా అప్పులు చేసి తెచ్చుకొన్న స్మార్ట్ టి.వి., ఫ్రిజ్, ఏ.సి., సోఫాసెట్ వంటి వస్తువులతో ఇంటిని నింపుకొనుచున్నారు.

అయితే దావీదు ఇలా అంటున్నాడు - నాకు అందనివాటి యందైనను గొప్పవాటి యందైనను నేను అభ్యాసము చేసికొనుట లేదు (కీర్తన 31:1).

ఇశ్రాయేలీయులకు రాజగుటకు దేవుడు నిన్ను కోరుకొనెనని సమూయేలు దావీదును అభిషేకించిన తరువాత కూడా ఇంచుమించు ఇరవై సంవత్సరములు రాజ భోగములను, రాజ సింహాసనమును పొందకున్నా 'యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు' (కీర్తన 23:1) అన్న సంతుష్టి కలిగియున్నాడు. మనము అవసరమైన వాటిని కొనుక్కొనుటకు, సంపాదించుకొనుటకు ఆశపడక; ప్రభువు మనకు అవసరమైన వాటిని తగిన సమయమున యిచ్చునని విశ్వాసము కలిగి యుండవలెను.

**రెండవదిగా - "నేను నా ప్రాణమును నిమ్మళపరచుకొని యున్నాను సముదాయించుకొని యున్నాను. చనుపాలు విడిచిన పిల్ల తల్లియొద్ద యున్నట్లు నా ప్రాణము నా యొద్ద నున్నది".** (కీర్తన 131:2)

దావీదు నా ప్రాణమును నిమ్మళపరచుకొని యున్నాను, సముదాయించుకొని యున్నాను అంటున్నాడు. మన ప్రాణం తినుటకు, త్రాగుటకు, సుఖించుటకు తొందరపడునదిగాను; అనేక విషయముల కొరకు కలవరపడునదిగాను ఉండును. అయితే విశ్వాసి తన ప్రాణమును సముదాయించుకొనుటకు, నిమ్మళపరచు కొనుటకు అభ్యాసము చేసికొనును.

చనుపాలు విడిచిన పిల్ల తన తల్లి యొద్ద ఉన్నట్లు నా ప్రాణము నా యొద్ద ఉన్నది అని దావీదు అంటున్నాడు. అనగా చంటి బిడ్డకు ఆకలి వేసినప్పుడు ఏడ్వగా, తల్లి బిడ్డను చేరదీసి పాలు పట్టించును; కడుపు నిండిన బిడ్డ హాయిగా నిద్రపోవును లేక కేరింతలు కొట్టుచు ఆడుకొనును. అంతేగాని, మళ్ళీ సాయంత్రం నాకు పాలు ఇస్తావా? ఈ రోజు నాకు స్నానం చేయిస్తావా? నాకు ఆభరణాలు, వస్త్రాలు ధరింపజేస్తావా? అన్న అనవసరమైన ప్రశ్నలకు, సందేహాలకు తావివ్వదు. తన తల్లి తనకు ఎప్పుడు కావలసినవి అప్పుడు ఇచ్చును అని నమ్మును. గనుక తన ప్రాణమును నిమ్మళపరచుకొని ప్రశాంతంగా ఉండును.

మనమును అన్యజనుల వలె ఏమి తిందుమా? ఏమి త్రాగుదుమా? ఏమి ధరించుకొందుమా? అని విచారించక, ఆయన యందు నమ్మిక యుంచవలెను. "ఎవని మనస్సు నీ మీద ఆనుకొనునో వానిని నీవు పూర్ణశాంతి గలవానిగా కాపాడుదువు" (యెషయా 26:3) అని బైబిలు చెప్పుచున్నది.

**మూడవదిగా – "ఇశ్రాయేలూ, ఇది మొదలుకొని నిత్యము యెహోవా మీదనే ఆశ పెట్టుకొనుము".** (కీర్తన 131:3)

తల్లిదండ్రుల మీద, కన్నబిడ్డల మీద, రావలసిన డబ్బు మీద, ఆస్తిపాస్తుల మీద ఆశలు పెట్టుకొన్న వారనేకులు నిరుత్సాహమునకు గురై, నిరాశ్రయులగుచున్నారు. అయితే మనకు కావలసిన ప్రతిదాని కొరకు ప్రభువు వైపు చూడటం మనం నేర్చుకోవాలి! మన హృదయ వాంఛలు తీర్చగల దేవునిపై మన ఆశ పెట్టుకొనుట ఎంతో ఉత్తమం! ఎందుకనగా మనము అడిగి ఊహించు వాటన్నిటి కంటె అత్యధికంగా ఇవ్వగలిగిన ప్రభువు మనకున్నాడు (ఎఫెసీ 3:20-21). "పరలోకము నుండి వచ్చు మన నివాసము దీనిపైని ధరించుకొన నపేక్షించుచు దీనిలో మూల్గుచున్నాము" (II కొరింథీ 5:2). గనుక యేసువైపు చూచుచు, ఆయన రాకడ కొరకు నిరీక్షిస్తూ, ఆయన యిచ్చు పరలోక రాజ్యముకై ఆశ పెట్టుకొని యుందము!

**– యన్. జయపాల్**

## కల్వరి ప్రేమధార పాఠకులకు విజ్ఞప్తి!

గత 35 సంవత్సరాలుగా ప్రచురించబడుతున్న ఈ పత్రికను కొనసాగించుటకు మీ ప్రార్థనా సహకారాలు అవసరం! మీరు ఈ పత్రిక వార్షిక చందా చెల్లించారా? లేనట్లైతే మీ వార్షిక చందా, విరాళములను పంపి, సహకరించండి! ఇప్పుడు పోస్టాఫీసులకు, బ్యాంక్‌లకు వెళ్ళవలసిన అవసరము లేకుండా, ప్రక్కన ఇవ్వబడిన నంబర్‌కు Google Pay ద్వారా కూడా మీ వార్షిక విరాళమును, కానుకలను పంపించవచ్చు!

**Google Pay**
**JAYAPAUL N**
**+91 95000 01111**

మేము దేవుని జతపనివారము :

# ఎపఫ్రా

**(కొలొస్స 1:7,8; 4:12; ఫిలేమోను 1:23)**

ఎపఫ్రా అనగా 'సుందరమైన' అని అర్థము! ఎపఫ్రా, పౌలు యొక్క తోటి దాసుడు, నమ్మకమైన పరిచారకుడు. ఎపఫ్రాలో ఉన్న ఒక గొప్ప ప్రత్యేకత - ఆత్మల కొరకు ప్రార్థనలో పోరాడుట! "మీలో ఒకడును, క్రీస్తుయేసు దాసుడునైన ఎపఫ్రా మీకు వందనములు చెప్పుచున్నాడు. మీరు సంపూర్ణులును, ప్రతి విషయములో దేవుని చిత్తమును గూర్చి సంపూర్ణ ఆత్మ నిశ్చయత గలవారునై యుండవలెనని ఇతడెల్లప్పుడును మీ కొరకు తన ప్రార్థనలలో పోరాడుచున్నాడు" (కొలొస్స 4:12).

ప్రతి సేవకుడు ఆత్మల కొరకు ప్రార్థనలో పోరాడవలసి యున్నది. అప్పుడే సంఘము కట్టబడును. సంఘము కట్టబడిన తరువాత కూడా సంఘములోని ప్రతి ఒక్కరు పరిపూర్ణులగునట్లు ప్రార్థనలో ప్రసవవేదన పడవలసి యున్నది. "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీ యందేర్పడు వరకు మీ విషయమై మరల నాకు ప్రసవవేదన కలుగుచున్నది" (గలతీ 4:19) అని పౌలు చెప్పుచున్నాడు.

ఒక జనమును కనుటకు ఒకనాటి ప్రసవవేదన చాలునా? ఈనాడు ఇట్లు ప్రసవ వేదనతోను, ప్రార్థనలో పోరాడుటతోను సంఘములను, ఆత్మలను కట్టు వారున్నారా? ఇతర దేశముల డబ్బు మీద, పేరు ప్రఖ్యాతుల కొరకు సేవను కట్టు వారనేకులను మనము చూచుచున్నాము గాని; స్థిరమైన నిలిచియుండే సేవను మోకాళ్ళపైననే కట్టగలము! నశించిపోతున్న ఆత్మల కొరకు కన్నీటితో ప్రార్థించనిదే సేవను కట్టలేము!

పౌలు సువార్తను ప్రకటించి, ఆత్మలను సంపాదించుటతో తృప్తిపడక; సంఘముల కొరకు బహు భారముతో ప్రార్థించెను. "జ్ఞానమునకు మించిన క్రీస్తు ప్రేమను తెలిసికొనుటకును తగిన శక్తి గలవారు కావలెననియు ప్రార్థించుచున్నాను" (ఎఫెసీ 3:19) అని ఎఫెసు సంఘమునకును; "మీరు క్రీస్తు దినమునకు నిష్కపటులును నిర్దోషులును కావలెననియు ప్రార్థించుచున్నాను" (ఫిలిప్పీ 1:9-11) అని ఫిలిప్పీ సంఘమునకును; "అన్ని విషయములలో ప్రభువును సంతోషపెట్టునట్లు, ఆయనకు తగినట్లుగా నడుచుకొనవలెననియు... దేవుని బతిమాలుచున్నాము" (కొలొస్స 1:9-12) అని కొలొస్సయి సంఘమునకును; "మా ప్రార్థనల యందు మీ విషయమై విజ్ఞాపనము చేయుచు, మీ అందరి నిమిత్తము ఎల్లప్పుడును దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించుచున్నాము" (I థెస్స 1:2-3) అని థెస్సలొనీక సంఘము నకును వ్రాసెను.

చెట్టు నాటిన తరువాత దానికి నీరు ఎంత అవసరమో, ఆత్మలను సంపాదించిన తరువాత వారిని పోషించుటకు ప్రార్థన అంత అవసరము! “ఇతడు మీ కొరకును, లవొదికయ వారి కొరకును, హియెరాపొలి వారి కొరకును బహు ప్రయాసపడు చున్నాడని యితనిని గూర్చి సాక్ష్యమిచ్చుచున్నాను” (కొలొస్స 4:13) అని పౌలు అనెను.

ఎపఫ్రా కొలొస్సయి, లవొదికయ, హియెరాపొలి అను లూకాస్ నది ఒడ్డున గల ఈ మూడు పట్టణములలో సేవను కట్టెను. లవొదికయ, కొలొస్సయి పట్టణము నకు 10 మైళ్ళ దూరములో ఉన్నది. హియెరాపొలి 13 మైళ్ళ దూరములో ఉన్నది. ప్రతి సేవకుడు తానున్న స్థలమునకు చుట్టూ ఉన్న గ్రామములలో కూడా సేవను కట్టవలసి యున్నది.

యేసు ప్రభువు కూడా తన చుట్టుపట్లనున్న గ్రామములు తిరుగుచు బోధించు చుండెను అని వ్రాయబడి యున్నది (మార్కు 6:6). నశించిన దానిని వెదకి రక్షించు టకు వచ్చిన ప్రభువు అట్టివారిని వెదకుచు వెళ్ళెను. అయితే ఈనాడనేకులు చక్కటి మందిరాలను, ఆశ్రమాలను కట్టుకొని స్థిరపడిపోవుచున్నారే గాని, కనీసం తమ చుట్టుప్రక్కల నశించిపోతున్న ఆత్మల కొరకు కూడా భారము లేనివారుగా ఉన్నారు.

మన భారత దేశంలో ఇంచుమించు 65 లక్షల గ్రామాలున్నాయి! ఈ గ్రామాల లోని అనేకులు ఇంకనూ సువార్తను విననివారు ఉన్నారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు సమృద్ధిగా దేవుని వాక్యము అందినప్పటికి; మిగిలిన 24 రాష్ట్రాలకు సరిగా సువార్త అందలేదు. కొన్ని రాష్ట్రాలలో బొత్తిగా సువార్త చెప్పేవారే లేరు.

అయితే పౌలు మూడు మిషనెరీ ప్రయాణములు చేసి అనేక స్థలాలు తిరిగెను. “యెరూషలేము మొదలుకొని చుట్టుపట్లనున్న ప్రదేశములందు ఇల్లూరికు ప్రాంతము వరకు క్రీస్తు సువార్తను పూర్ణముగా ప్రకటించియున్నాను. క్రీస్తు నామమెరుగని చోట్లను సువార్తను ప్రకటింపవలెనని మిక్కిలి ఆశగలవాడనై యుండి ఆలాగు ప్రకటించితిని” అని అన్నాడు (రోమా 15:19-21).

“నా వెంబడి రండి, నేను మిమ్మును మనుష్యులను పట్టు జాలరులుగా చేతును” (మత్తయి 4:19-20); “మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి” (మార్కు 16:15); “ఇదిగో నేను యుగసమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను” (మత్తయి 28:20) అన్న ప్రభువు ఆజ్ఞను శిరసావహిస్తూ; పౌలువలె, ఎపఫ్రా వలె మనమును భారము కలిగి; ప్రార్థనలో పోరాడుచు, ఆత్మలను సంపాదించుచు, మన చుట్టుప్రక్కల నున్న అన్ని గ్రామములలో సేవను కడదాం! - యన్. జయపాల్

**(‘మేము దేవుని జతపనివారము’ పుస్తకము కావలసినవారు రూ. 70/- పంపి, పొందగలరు!)**

# అయ్యో! నేను అపవిత్రుడను!

**"యెహోవాను నేను కన్నులారా చూచితిని".** (యెషయా 6:5)

యెషయా ఒక గొప్ప ప్రవక్త! ఒక దినమున సింహాసనమందు ఆసీనుడై, సమస్త మహిమతో నిండిన ప్రభువును చూచెను. తెల్లని దూతలు 'యెహోవా పరిశుద్ధుడు పరిశుద్ధుడు పరిశుద్ధుడు' అని గొప్ప స్వరముతో గాన ప్రతిగానములు చేయుట వినెను. దేవుని యొక్క మహిమను, పరిశుద్ధతను చూచెను. వెంటనే అతడిట్లు కేక వేసెను, "అయ్యో, నేను అపవిత్రమైన పెదవులు గలవాడను, అపవిత్రమైన పెదవులు గల జనుల మధ్య నివసించువాడను, నేను నశించితిని" (యెషయా 6:5).

దేవుని యొక్క పరిశుద్ధతను చూచిన వెంటనే 'అయ్యో, నేను అపవిత్రుడను' అని కేక వేసెను. అనేకులు తమ అపవిత్రతను గ్రహించుకొనలేకపోవుచున్నారు. వారు దేవుని పరిశుద్ధత యొక్క ప్రత్యక్షతను పొందలేదు. ఒకని పెదవులు కూడా అతని అపవిత్రపరచునని అనేకులు ఎరుగరు! నీ పెదవుల నుండి వచ్చు అబద్ధములు, బూతులు, దూషణలు నిన్ను అపవిత్రపరచును. నీ పెదవుల మధ్యనున్న సిగరెట్టు దేవుని ఆలయమైన దేహమును అపవిత్రపరచును. నీ పెదవులతో జుట్టుకొను ప్రతి పాపము నిన్ను అపవిత్రునిగా చేయును. డంబములాడు పెదవులు, కపటము లాడు పెదవులు నాకసహ్యమని యెహోవా సెలవిచ్చుచున్నాడు. అబద్ధములాడు పెదవులు యెహోవాకు హేయము. ఈలాంటి పెదవులు నీకున్నవా?

యెషయా తన అపవిత్రమైన పెదవుల కొరకు కేక వేయగానే, దేవుని దూత బలిపీఠము మీద నుండి నిప్పు తీసి, అతని పెదవులకు తగిలించి ఇట్లనెను – "ఇది నీ పెదవులకు తగిలెను గనుక నీ పాపమునకు ప్రాయశ్చిత్తమాయెను, నీ దోషము తొలగిపోయెను" (యెషయా 6:7). ఎంత ఆశ్చర్యము! చెడ్డ మాటలాడు నీ పెదవులను క్రీస్తు ముట్టి, సువార్తను ప్రకటించు పెదవులుగా చేయును.

సంఘములో ఆసక్తికరంగా మాట్లాడిన వట్టి మాటల కంటె; సహనముతో, శ్రద్ధతో, ప్రేమ ప్రయాసలతో నిండిన కొద్ది మాటలే ఎంతో ప్రయోజనకరములై యుండును. అట్టి మాటలు నీవు పలుకవలెనంటే బలిపీఠము మీదనున్న అగ్ని నీ పెదవులను కాల్చవలెను. "యెహోవా మాటలు పవిత్రమైనవి, అవి మట్టిమూసలో ఏడు మారులు కరిగి ఊదిన వెండియంత పవిత్రములు" (కీర్తన 12:6) అని జ్ఞాపకముంచుకొనవలెను. ప్రభువా, అట్టి మాటలు నా నోట ఉంచి, నన్ను వాడుకో అని ప్రార్థించు!

**– యన్. జయపాల్**

# క్రీస్తు అనుకరణ

**- థామస్ ఏ. కెంపిస్**



నా కుమారుడా, ప్రపంచమంతటిలోనున్న జ్ఞానుల యొక్కయు, తత్త్వ విమర్శకుల యొక్కయు జ్ఞానమును మించినట్టి మధురాతి మధురములైన నా పలుకుల నాలకించుము! "నా వాక్కులు ఆత్మయు జీవమునై యున్నవి. వాటిని మానవ బుద్ధితో తూచరాదు. వ్యర్థమైన మెప్పులకు వాటిని వాడరాదు గాని; మౌనముగా విని అధిక వినయముతోను, గొప్ప యనురాగముతోను వాటి నంగీకరింప వలయును. ప్రభూ! నీవెవనికి యుప దేశము చేయుదువో, యెవనికి నీ ధర్మ విధులను బోధింతువో యట్టి నరుడు ధన్యుడు. అట్టివాడు భూమి మీద వినాశము చెందకుండునట్లు దుర్దినమందు నీవు వానికి విశ్రాంతి ననుగ్రహింతువు" అని నేను పలికితిని (యోహాను 6:63; కీర్తన 94:12,13).

ప్రభువు ఈలాగు సెలవిచ్చుచున్నాడు – ఆరంభము నుండియు నేను ప్రవక్తలకు బోధించితిని. అందరితో నేటికిని మాటలాడుచునే యున్నాను (హెబ్రీ 1:1). కాని, అనేకులు తమ హృదయములను కఠినపరచుకొని, చెవవిటివారై నా స్వరమును వినజాల కున్నారు. బహు జనులు దేవుని స్వరము వినుటకు మారుగా, లోకము యొక్క స్వరమును ఆశతో విందురు. వారు దేవుని చిత్తమును నెరవేర్చుటకు బదులు తమ ఇంద్రియ వాంఛల ననుసరింతురు. లోకము వినశ్వరములై హీనమైన వాటిని మానవుల కిచ్చును. జనులు దానిని ఆశతో సేవింతురు. నేను మహోత్తమము లైన నిత్యవసరముల నిత్తునందును. కాని మానవుల హృదయములు జడత్వము పొంది, నేనిచ్చు వాటిని గోరవు!

ఈ లోకమును, లోకాధికారులను మానవులెంతటి గొప్ప లక్ష్యముతో సేవించుచు, విధేయులగుచున్నారో; యంతటి లక్ష్యముతో నన్ను సేవించి విధేయుడగువాడెవడున్నాడు? ఓ సీదోను పురమా, సిగ్గునొందమని సముద్రము ఘోషించుచున్నది (యెషయా 23:4). కారణమడుగుచున్నావా? వినుము! కించిత్సంపాద్యమునకై మనుజులు బహుదూరపు ప్రయాణము చేయుదురు. కాని నిత్యజీవము సంపాదించుకొనుటకు అనేకులు తామున్న చోట నుండి తమ కాలైనను కదుపరు. కొద్దిపాటి లాభమునకై యెంతటి ప్రయాసమైనా పొందుదురు, ఒక్క రూప్యమునకై

యభిమానము తెగనాడి వాదులాడుదురు, తృణప్రాయమగు కించిద్ధనంబునకు, రిక్త బహుమానంబునకు మానవులు రాత్రింబగలు పనిచేయుటకు వెనుకాడరు.

కాని అయ్యో! నిర్వికార భాగ్యము కొరకును, వెలలేని బహుమానము కొరకును, అత్యున్నత గౌరవము కొరకును, యనంత మహిమ కొరకును కొద్దిగానైనా శ్రమించుట కోర్వరు. కాన సణుగుచున్న సోమరి దాసుడా, సిగ్గునొందుము. నీవు జీవములో ప్రవేశించుటకు సిద్ధముగానుండు దానికన్న వారు నాశనములో ప్రవేశించుట కెక్కువ సిద్ధముగా నున్నారు. నీవు సత్యమునందు సంతోషించుట కన్న నెక్కువగా వారు వ్యర్థమైన ప్రపంచ వైభవమునందు సంతోషించుచున్నారు.

వారు కొన్నిసార్లు ఆశాభంగము పొందుదురు. కాని నా వాగ్దానమెవనిని వంచింపదు. నన్ను నమ్మినవాడెవడును రిక్త హస్తములతో పోవడు. ఎవడైనను నమ్మకముగా నా ప్రేమయందు అంతము వరకు నిలిచిన యెడల నేను వాగ్దానము చేసినదాని నిత్తును. నేను చెప్పిన మాటను నెరవేర్తును. నేను సజ్జనుల కందరకు బహుమానము నిచ్చువాడను. నా యందు భక్తి నిలుపువారందరకు బలమైన యండగా నిలుచువాడను (మత్తయి 24:35; 5:6; 25:21; ప్రకటన 2:23).

నీ హృదయమందు నా మాటలు వ్రాసియుంచుకొని శ్రద్ధతో వాటిని మననము చేయుము. శోధన కాలము నందు నీకవి యెంతో ప్రయోజనకరములగును. నీవు పఠించునపుడు నీవు గ్రహింపనది, నిన్ను నేను దర్శించు కాలమున గ్రాహ్యమగును. నేనేర్పరచుకొన్నవారిని శోధన, ఆదరణ అను రెండు విధములుగా దర్శింతును.

ప్రతి దినము నేను రెండు పాఠములు వారికి చదివి వినిపింతును. మొదటిది, వారి దుష్ట చర్యలను గూర్చిన గద్దింపు; రెండవది, వారు తమ సద్గుణములను వృద్ధి చేసుకొనుటకైన హెచ్చరిక అనునవి! నా మాటలను వినియు వాటిని నిరాకరించు వారికి అంత్యదినమందు తీర్పు తీర్చువాడొకడు కలడు.

**భక్తి నిమిత్తము ప్రార్థన :**

ప్రభువా, నా దేవా, నా సర్వ సౌభాగ్యము నీవే; నీతో మాటలాడ తెగించుటకు నేనెంతటి వాడను? నేను గర్భ దరిద్రుడను, నీచాతినీచుడగు దాసుడను. అతి హేయమగు కీటకమును, నేను వచింపలేనంత హీన దౌర్భాగ్యుడను! ప్రభూ, అటులయ్యును నన్ను జ్ఞాపకము చేసికొనుము. నేను వట్టి శూన్యుడను, ఏమియు లేనివాడను, ఏమియు చేయజాలనివాడను!

ప్రభూ, నీవు మాత్రమే యుత్తముడవు, నీతిమంతుడవు, పరిశుద్ధుడవు! సర్వము జరిగింపగలవాడవు నీవే, సర్వము చేయగలవాడవు నీవే, సర్వము నింపగలవాడవు నీవే! పాపిని మాత్రమే నీవు శూన్యముగా విడువవు! ప్రభూ, నీ కరుణా వాత్సల్యము

లను జ్ఞాపకము చేసికొనుము. సృష్టించినవేవి గాని వ్యర్థమగుట కిచ్ఛయింపవు గదా! నా హృదయమును నీ యనుగ్రహముతో నింపుము.

ప్రభూ, నీ కరుణా కటాక్షములతో నన్ను బలపరచనిచో నా నికృష్ట జీవితము నేనెట్లు భరింపగలను? నాకు విముఖుడవు గాకుము. నన్ను సందర్శించుటకు జాగుసేయకుము. నా యాత్మ తృష్ణగొనుచున్న భూమివలె గాకుండునట్లు నా మీద నుండి నీ యాదరణ నంతరింప జేయకుము.

ప్రభూ, నీ చిత్తము నెరవేర్చుటకు నాకు ఉపదేశము చేయుము. నీ దృష్టిలో యోగ్యతతోను, వినయముతోను జీవించుటకు నాకు నేర్పుము. ఏలయన నా జ్ఞానము నీవే, నిశ్చయముగా నీవు నన్నెరిగి యున్నావు. జగదుత్పత్తికి పూర్వమే, ప్రపంచమందు నేనుద్భవింపక ముందే నీవు నన్నెరిగి యుంటివి. **– థామస్ ఏ. కెంపిస్**

# నా కొరకు నీవేమి చేసితివి?

కౌంట్ జింజెన్ డార్ఫ్ అనే ఒక ధనవంతుడైన యౌవనస్థుడు తన గుఱ్ఱముపై స్వారీ చేస్తూ, పలుప్రాంతాలు తిరుగుతూ విలాస యాత్రలు చేయుచుండెను. అందమైన పర్వతాలను, నదీ తీరాలను, చారిత్రాత్మక స్థలాలను తిరుగుచూ సంతృప్తి కొరకు, సమాధానము కొరకు తాపత్రయపడిననూ ఫలితము పొందలేదు.

అయితే ఒకనాడు ఒక స్థలంలోనికి వచ్చినప్పుడు, సిలువలో వ్రేలాడుచున్న యేసుక్రీస్తు యొక్క చిత్ర పటమును చూచెను. ముందెన్నడూ చూడని ఆ దృశ్యమును చూచి, ఆశ్చర్యపడి, కన్నులెత్తి చూడగా; సిలువలో వ్రేలాడుచున్న యేసుక్రీస్తు శిరస్సు మీద ఉన్న ముళ్ళ కిరీటము, జాలి దయలతో నిండిన ఆయన ముఖము, ఆయన చేతులలోని గాయములు, డొక్కలో బల్లెపుపోటు, కాళ్ళలో సీలలు ఉన్న ఆ సిలువ దర్శనం అతని హృదయాన్ని నలుగగొట్టెను.

'ఎవరు ఈ వ్యక్తి? ఎందుకు ఇలా వ్రేలాడుచున్నాడు?' అని ఆలోచిస్తూ, మరింత క్రిందికి చూచిన అతని కన్నులు 'నీ కొరకు నా ప్రాణమిచ్చితిని, నా కొరకు నీవేమి చేసితివి?' అని వ్రాయబడిన మాటలపై పడెను. పరిశుద్ధాత్మ అతనిని దర్శించగా, మోకాళ్ళ మీద పడ్డ జింజెన్ డార్ఫ్, 'నా కొరకు నీ ప్రాణం ఇచ్చావా? ఆలాగైతే నా శేష జీవితమును నీ కొరకే జీవిస్తాను' అంటూ తన్ను తాను యేసుక్రీస్తుకు సమర్పించుకొనెను. ఆ తర్వాత అతడు గొప్ప భక్తుడై, అనేక ఆత్మలను ప్రభువు కొరకు సంపాదించెను.

"మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి, మీలో నున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కారు, విలువపెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" (I కొరింథీ 6:19,20). **– యన్. జయపాల్**

# అర్థాలు తెలుసుకొందాం!

**(గత సంచిక తరువాయి...)**

516. ఏన్‌హాసోరు = ఊరి యొక్క ఊట (యెహోషువ 19:35-38)
517. ఏన్గన్నీము = తోటల జలధార (యెహోషువ 15:33-35; 19:17-23)
518. ఏన్తప్పూయ = ఊపిరి తీయువాని ఊట (యెహోషువ 17:7)
519. ఏనాను = ఊట, కన్నులు గలది (సంఖ్యా 1:15; 2:29)
520. ఏనాము = వారి యొక్క ఊట, రెండు ఊటలు (యెహోషువ 15:33-35)
521. ఏనాయిము = బాహాటము (ఆది 38:14,21)
522. ఏన్మిష్పతు = విమర్శ, తీర్పు యొక్క ఊట (ఆది 14:7)
523. ఏన్రిమ్మోను = దానిమ్మ పండ్ల ఊట (నెహెమ్యా 11:29)
524. ఏనెగ్లాయీము = రెండు దూడల ఊట (యెహెజ్కేలు 47:10)
525. ఏన్గెదీ = మేకపిల్ల యొక్క ఊట (I సమూయేలు 23:29)
526. ఏన్దోరు = నివాసుల ఊట (యెహోషువ 17:11)
527. ఏపయి = చీకటి కలిగించు ఛాయలు (యిర్మీయా 40:8)
528. ఏఫెస్దమ్మీము = రక్తపు పొలిమేర, కాలువల విశాలత (I సమూయేలు 17:1)
529. ఏఫెరు = జింక పిల్ల (ఆది 25:4; I దిన 4:17)
530. ఏఫోదు = కప్పు, యాజకుని నడికట్టు (నిర్గమ 28:4; సంఖ్యా 34:23)
531. ఏబాలు = బోడి కొండ, ఎడారి స్థలము (ఆది 36:23; ద్వితీ 11:29)
532. ఏబెరు = ఆవలి దేశస్థుడు (ఆది 10:21; నెహెమ్యా 12:20)
533. ఏమీయులు = భయంకరమైన ప్రజ (ఆది 14:6; ద్వితీయో 2:10)
534. ఏయిఫా = చీకటి (ఆది 25:4; I దిన 2:46)
535. ఏరాను = మెలకువ (సంఖ్యా 26:36)
536. ఏరీ = మెలకువ పడువాడు, కావలివాడు (ఆది 46:16)
537. ఏరు = మెలకువగా నుండుట (ఆది 38:3; లూకా 3:28)
538. ఏల్ ఎలోహేయి ఇశ్రాయేలు = ఇశ్రాయేలు దేవుడే దేవుడు (ఆది 33:20)
539. ఏల్ బేతేలు = దేవుని మందిరము యొక్క దేవుడు (ఆది 35:7)
540. ఏలతు, ఎలతు = ఈత చెట్ల తోపు (ద్వితీయో 2:8; II దిన 26:2)
541. ఏలా = సింధూర వృక్షము (ఆది 36:41; I రాజులు 16:6)
542. ఏలాము = పడుచుతనము, ఎత్తైనవాడు (ఆది 10:22)
543. ఏలాలే = ఆరోహణుడైన/ హెచ్చుగా నుండు దేవుడు (సంఖ్యా 32:3)
544. ఏలీ = నా దేవుడు (I సమూయేలు 1:3; I రాజులు 2:27)
545. ఏలీ, ఎలోయీ = నా దేవా (మత్తయి 27:46; మార్కు 15:34)

**(సశేషం)** - ఎడిటర్

# జాన్ నాక్స్ (1513-1572)



జాన్ నాక్స్ సాట్లాండ్‌లోని గిఫోర్డ్ గేట్ నందు 1513వ సంవత్సరములో జన్మించెను. ఈయన తల్లిదండ్రులిద్దరూ కేథలిక్కులు. వీరు తెలివైనవారు మరియు ధనికులు. జాన్ నాక్స్ లాటిన్ మరియు గ్రీకు చదివెను. గ్లాస్గోలోని విశ్వ విద్యాలయములో 8 సంవత్సరములు చదివి M.A. డిగ్రీని సంపాదించెను. చదువు పూర్తికాగానే తత్త్వ శాస్త్రమును బోధించు ఉపాధ్యాయుడుగా అదే కళాశాలలో పని చేసెను. జాన్ నాక్స్ తన 25వ సంవత్సరములో దేవుని సేవకు యాజకుడుగా నియమింపబడెను.

ఈ క్రొత్త పదవిలో ఇతడు సాట్లాండ్‌లోని రోమన్ సంఘము ఎంతగా పాడయ్యెనో చూడగలిగెను. బైబిలును ఎక్కువగా చదువుచుండెను. ఇట్లు 7 సంవత్సర ములు గడిపెను. ఇతడు సంఘము యొక్క స్థితిని గుర్తించి, దానిలోని తప్పులను ఖండించవలెనని ఆశించెను గాని; అట్లు చేసినచో తాను మరణమునకు గురి కాగలనని గ్రహించి, ఆ సంఘమును వదిలిపెట్టెను. ఎక్కువ సమయం బైబిలు చదువుట యందును, ప్రార్థించుట యందును గడిపెను.

జాన్ నాక్స్ ప్రభువు చిత్తము కొరకై ప్రార్థించుచుండెను. ఆ దినములలో జార్జి అను ఒక ప్రసంగీకుడు రోమన్ కేథలిక్ సంఘము యొక్క దుష్టత్వమును గూర్చి ఖండించుచుండెను. జాన్ నాక్స్ అతని యొద్ద చేరి, మరనేక సువార్త సత్యములను నేర్చుకొనుచుండెను. జాన్ నాక్స్ సేవకుని గాను, సహాయకుని గాను జార్జికి తోడ్పడుచుండెను. అనేక సార్లు జార్జితో పాటు వెంట వెళ్ళెడివాడు. ఒకసారి జార్జిని పట్టుకొని కాల్చివేయుటకు తీసుకొనిపోయి చంపివేసిరి. ఆలాగు జార్జి క్రీస్తు కొరకు హతసాక్షి ఆయెను.

జాన్ నాక్స్‌ను కూడా పట్టుకొనవలెనని ప్రయత్నించుచుండగా, అతడు ఒక స్థలము నుండి మరియొక స్థలమునకు మారుచు చివరికి జర్మనీకి వెళ్ళవలెనని ఆశించెను గాని; అతని స్నేహితులు అక్కడే ఒక భవనములో ఉండమని కోరిరి. 1547వ సంవత్సరములో తనతో కొందరిని తీసుకొని వెళ్ళి, ఆ భవనములో ఉండెను. అక్కడ కొన్ని కుటుంబముల వారికి చదువు చెప్పెడివాడు. అయితే

తనను వెదకుచున్నారని తెలిసికొని, ఆ భవనంలో ఉండుట శ్రేయస్కరం కాదని, తన స్నేహితునితో పాటు సెయింట్ ఆంద్రూ అను స్థలమునకు వెళ్ళెను. అక్కడ కొద్ది రోజులలోనే అనేకులు వచ్చి, అతడు చెప్పెడివి వినెడివారు. వారికి జాన్ నాక్స్ దేవుని వాక్యం బోధించెడివాడు. అంతేగాక, ఆ ప్రజలకు సాట్లాండ్‌లోని భక్తిహీనతను గురించి, దేవుని యొక్క పరిశుద్ధతను గురించి బోధించెడివాడు.

అంతవరకు బహిరంగంగా ప్రసంగించుటకు భయపడెడి జాన్ నాక్స్ 30 సంవత్సరముల వయస్సులోకి రాగానే ధైర్యం గల ప్రసంగీకునిగా మారెను. కాని అతడు ఎప్పుడూ మంచి ప్రసంగములు చేయుటకు ప్రయత్నించలేదు. అయితే 'నేను దేవుని దగ్గర నుండి వచ్చిన ప్రవక్తను, నా దగ్గర నుండి తియ్యటి మాటలు రావు, కఠినమైన మాటలే వచ్చును' అని అనెడివాడు. దేశములో హింసలు ఉండినప్పటికి, నాక్స్ ఆ ప్రజలకు వారి దుష్టత్వమును గురించి, వారి పాపమును గురించి ఖండిస్తూ, బోధించెడివాడు. దేవుని ఉగ్రత వారి మీదికి వచ్చునని హెచ్చరించెడివాడు. పశ్చాత్తాపపడి ప్రభువు దగ్గరకు రమ్మని బ్రతిమాలెడివాడు.

చివరకు స్కాట్లాండ్ దేశపు రాణి కూడా జాన్ నాక్స్ బోధలకు కదిలించబడినను; పశ్చాత్తాపపడక నాక్స్‌ను, అతని అనుచరులను ఓడ ఎక్కించి ఫ్రాన్స్ దేశమునకు బహిష్కరించెను. అక్కడ నాక్స్‌ను సంకెళ్ళతో బంధించి, జైలులో వేసిరి. అయినను జాన్ నాక్స్ ఏ నరునికి భయపడకూడదని తీర్మానించుకొనెను.

మరియకు మ్రొక్కరాదనియు, విగ్రహారాధన తప్పనియు బోధించిన నాక్స్ దగ్గరకు రంగులు వేసిన ఒక విగ్రహమును తెచ్చి, దానిని ముద్దు పెట్టుకొనమనిరి. కాని అట్లు చేయుటకు అతడు నిరాకరించి, ఆ విగ్రహమును సముద్రములోనికి నెట్టివేసెను. 12 నెలల తరువాత ఆ ఓడ యొక్క బానిసత్వం నుండి విడుదల పొంది, మరల స్కాట్లాండ్‌కు వెళ్ళుట మంచిది కాదని తెలుసుకొని ఇంగ్లాండుకు వెళ్ళెను.

అచ్చట బహు జనులు గలిగిన ఆంగ్ల సంఘములో అతనికి దేవుని వాక్య మందించు అధికృత దొరికెను. 1551వ సంవత్సరమునకు జాన్ నాక్స్ ఆరు సంఘములను చూచుకొనెడివాడు. తన 40 సంవత్సరముల వయస్సులో ఇతడు 'మార్జోరీ' అను నామెను పెండ్లి చేసికొనెను. జాన్ నాక్స్, రాజైన ఎడ్వర్డ్ IV కోర్టులో (రాజ మందిరంలో) కూడా ప్రసంగించెడివాడు. ఎడ్వర్డ్ కూడా ఇతనికి స్నేహితుడయ్యెను. ఇతని నమ్మకత్వమును చూచి ఇతనికి ఇంగ్లాండ్‌లో మంచి నాయకత్వమును, సువార్తకు స్వేచ్ఛను కలిగించెను.

కాని, 1553వ సంవత్సరము జూలై మాసంలో యౌవనస్థుడైన ఎడ్వర్డ్ రాజు మరణించెను. తరువాత 'మేరీ ట్రూడర్' అనే ఆమె రాణి ఆయెను. ఆమె రాణియైన

తరువాత జాన్ నాక్స్‌ను నిర్లక్ష్యపెట్టి; అతనిని, క్రైస్తవులను హింసించడం మొదలు పెట్టెను. నాక్స్ జీతమును కూడా తగ్గించివేసెను. ఆ హింసలలో ఇతని స్నేహితులలో కొందరు హతసాక్షులైరి! తరువాత సాట్లాండ్‌కు వెళ్ళెను.

జాన్ నాక్స్ తన దేశములోని ప్రజలలో మార్పును, వాక్యానుసారముగా జీవించుటను చూచి; ప్రభువును స్తుతించి, స్వేచ్ఛగా దేవుని వాక్యమును బోధించుటకు ఆరంభించెను. ఒకసారి జాన్ నాక్స్ ప్రసంగించుచుండగా; రాణియైన మేరీ, కొంతమంది స్కాట్లాండ్ బిషప్పులు కూడా వినిరి. కాని దేవుని ఆత్మ శక్తితో బోధించు ఆ బోధకు అడ్డు చెప్పలేకపోయిరి. తరువాత జాన్ గొప్ప జన సమూహములకు దేవుని వాక్యమును బోధించెను.

1560లో జాన్ నాక్స్ భార్య మార్‌జోరీ మరణించెను. జాన్ నాక్స్ ఇద్దరు కుమారులు కూడా చిన్నతనములోనే మరణించిరి. జాన్ నాక్స్ జీవితములో సమస్య తరువాత సమస్య, విచారము వెంట విచారము మరనేక కష్టములు ఎదురాయెను. కాని ఇతడు నిరుత్సాహపడక, తాను చేయవలసిన దేవుని పనినే చేయుచున్నందులకు సంతోషించెను.

1570వ సంవత్సరములో ఇతడు నడువలేని, వ్రాయలేని స్థితిలో ఉండెను. అందరూ ఇక జాన్ నాక్స్ మరణించునని తలంచిరి. కాని ప్రభువు అతనికి నూతన బలమిచ్చి, రెండు సంవత్సరములు ప్రసంగించుటకు కృపనిచ్చెను. 1572వ సంవత్సరము నవంబరు నెలలో మరల జబ్బుపడి, బహు బలహీనుడాయెను. ఇతడు మరణించే రోజున భార్యచే చాలాసేపు బైబిలు చదివించుకొని వినెను. చివరకు తన 60వ యేట 1572 నవంబరు 24వ తేదీ రాత్రి 11 గంటలకు వారు ప్రార్థించుటకు మోకరించగా, జాన్ నాక్స్ బహు శాంతి సమాధానములతో అతడు ప్రేమించి, సేవ చేసిన ప్రభువుతో ఉండుటకు వెళ్ళిపోయెను. – యన్. జయపాల్

**(ఇటువంటి 25 మంది చొప్పున భక్తుల, మిషనెరీ జీవితములను గూర్చి వ్రాయబడిన 'కల్వరి యోధులు' మరియు 'సిలువ సాక్షులు' పుస్తకములు కావలసినవారు రూ. 180/- పంపి, పొందగలరు!)**


## 16 GB మెమొరీ కార్డ్స్ & పెన్ డ్రైవ్స్

★ సందేశాలు సంగీతాలు - యెరూషలేము (60 గంటలు)
★ కల్వరి సునాద గీతములు - కుటుంబమును కట్టు సత్యములు (60 గంటలు)
★ మీకు తెలుసా? - మన్నా మనకు (60 గంటలు)

**ఒక్కొక్కదాని వెల రూ. 1,000/-. అయితే తగ్గింపు ధరగా రూ. 700/- లకే పొందగలరు!**

**మా చిరునామా : Dr. N. JAYAPAUL, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.** మరిన్ని వివరములకు – (0) 89 39 39 39 39

మీరు చదివారా?

# కల్వరి ప్రచురణలు

మీ ఆధ్యాత్మిక జీవితానికి సహాయపడే Dr. N. జయపాల్ గారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | బైబిలులోని 66 పుస్తకములలో క్రీస్తు | (66 పుస్తకములపై వివరణ) | 100.00 |
| 2. | బైబిలులోని 2555 పదాలకు అర్థాలు తెలుసుకొందాం! | | 100.00 |
| 3. | కల్వరి సిరులు | (నూటయాభై ప్రసంగాంశములు) | 100.00 |
| 4. | ఫలించుటకు సహకారి | (విశ్వాసులకు, సేవకులకు సహకారి) | 75.00 |
| 5. | మీకు తెలుసా? | (బైబిలు నిరూపించే ఈ 85 విశేషములు) | 75.00 |
| 6. | గొప్ప పలుకులు | (భక్తుల, మిషనెరీల సమయోచిత పలుకులు) | 75.00 |
| 7. | జ్ఞానవంతురాలు - మూఢురాలు | (పాత నిబంధనలోని 25 మంది వనితల చరిత్ర) | 80.00 |
| 8. | కొనియాడబడిన స్త్రీలు | (క్రొత్త నిబంధనలోని 25 మంది వనితల చరిత్ర) | 80.00 |
| 9. | యౌవనుడా! నీ గమ్యమేది? | (25 మంది బైబిలులోని యౌవనుల చరిత్ర) | 80.00 |
| 10. | రాజుల చరిత్ర | (ఇశ్రాయేలు, యూదా రాజుల చరిత్ర) | 80.00 |
| 11. | కరుణ కథలు | (రెండు వందల చిన్న కథలు) | 80.00 |
| 12. | సువార్త కథలు | (తొంభై కథలు) | 80.00 |
| 13. | అగ్ని సందేశములు | (44 క్లుప్త సందేశములు) | 75.00 |
| 14. | దేవుని వాక్య ధ్యానములు | (88 క్లుప్త వర్తమానములు) | 75.00 |
| 15. | ప్రసంగ సాగరము | (40 క్లుప్త ప్రసంగములు) | 80.00 |
| 16. | ఉజ్జీవ ప్రసంగములు | (25 ప్రసంగములు) | 75.00 |
| 17. | ప్రసంగ జ్వాలలు | (33 ప్రసంగములు) | 75.00 |
| 18. | ప్రకటన సందేశములు | (ప్రకటన గ్రంథములోని ముఖ్యాంశాలు) | 75.00 |
| 19. | కల్వరి యోధులు | (25 మంది భక్తుల, మిషనెరీల చరిత్ర) | 75.00 |
| 20. | సిలువ సాక్షులు | (25 మంది భక్తుల, మిషనెరీల చరిత్ర) | 60.00 |
| 21. | మేము దేవుని జతపనివారము | (పౌలు పరిచర్యలో ఉన్న 20 మంది చరిత్ర) | 50.00 |
| 22. | హృదయ రహస్యములు | (30 రకముల హృదయ స్థితులు) | 80.00 |
| 23. | ప్రభువా! నీ అడుగుజాడలలో నడువనిమ్ము | (క్రీస్తువలె నుండుట ఎట్లు?) | 45.00 |
| 24. | నా మట్టుకైతే బ్రతుకుట క్రీస్తే | (యన్. జయపాల్ గారి స్వీయ చరిత్ర) | 100.00 |
| 25. | సిలువమూర్తి శిష్యులు | (పండ్రెండు మంది శిష్యుల చరిత్ర) | 40.00 |
| 26. | ఆత్మఫలమేమనగా | (గలతీ 5:22పై ధ్యానము) | 35.00 |
| 27. | క్రీస్తు ప్రేమ కథలు | (నలభై కథలు) | 35.00 |
| 28. | ప్రభువా! ప్రార్థన నేర్పుము | (ప్రభువు నేర్పిన ప్రార్థనపై ధ్యానం) | 45.00 |
| 29. | ప్రియుడా! ప్రార్థించు | (ముప్పై రకముల ప్రార్థనా పద్ధతులు) | 45.00 |
| 30. | ఉపవాస ప్రార్థనా శక్తి రహస్యం | (ఉపవాస ప్రార్థనా ఫలితములు) | 45.00 |

| | | | |
|---|---|---|---|
| 31. | హృదయ పరిశోధన | (హృదయములోని పాపములు - విడుదల) | 35.00 |
| 32. | ఏది నీ మార్గము? | (జీవ - మరణ మార్గములు) | 40.00 |
| 33. | ప్రత్యక్షపు గుడారములో క్రీస్తు | (ప్రత్యక్షపు గుడారము యొక్క వివరణ) | 35.00 |
| 34. | యేసులో సురక్షత | (బైబిలులోని ఆశ్రయపురములలోని క్రీస్తు) | 30.00 |
| 35. | నేను ఉన్నవాడను | (దేవుని యొక్క పండ్రెండు నామములు) | 35.00 |
| 36. | గుంటనక్కలను పట్టుకొనుడి | (చిక్కులబెట్టు ఏడు పాపములు) | 45.00 |
| 37. | సిలువ ప్రేమ | (క్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలు) | 35.00 |
| 38. | అంత్యదినములలో అపాయములు జాగ్రత్త! | (హెచ్చరికలు) | 40.00 |
| 39. | హృదయ పరీక్ష | (హృదయమును పాడుచేయు ఏడు పాపములు) | 25.00 |
| 40. | నిజ క్రైస్తవులు | (సంపూర్ణ క్రైస్తవత్వమునకు గల లక్షణములు) | 40.00 |
| 41. | చిన్నవి నాలుగు కలవు | (చిన్న జీవులు - అవి నేర్పు పాఠములు) | 35.00 |
| 42. | పండుగలు అప్పుడు - ఇప్పుడు | (పండుగలలోని అంతరార్థము) | 20.00 |
| 43. | సమస్యల్లో ఉన్నారా? | (సమస్యలను జయించుట ఎట్లు?) | 40.00 |
| 44. | ప్రభువా! నీ చిత్తములో సాగనిమ్ము | (దేవుని చిత్తము తెలుసుకొనుట ఎట్లు?) | 30.00 |
| 45. | ప్రభువా! ఆత్మల భారమిమ్ము | (ఆత్మల జాలరులుగా ఉండుటకు ప్రార్థన) | 25.00 |
| 46. | ప్రభువా! నన్ను పరిశోధించుము | (హృదయ శుద్ధికి సహకారి) | 30.00 |
| 47. | ప్రభువా! నన్ను కనికరించుము | (పేతురు, యూదాల అంతము) | 20.00 |
| 48. | ప్రభువా! నన్ను వాడుకొనుము | (దేవుని చేతిలో వాడబడుటకు సిద్ధపాటు) | 25.00 |
| 49. | ప్రభువా! విరిగిన హృదయమిమ్ము | (విరిగిన హృదయ స్థితి) | 30.00 |
| 50. | విత్తువాని ఉపమానము | (నాలుగు నేలల వివరణ) | 20.00 |
| 51. | కుటుంబాలను కట్టు సత్యాలు | (కుటుంబమును కట్టుకొనుట ఎట్లు?) | 150.00 |
| 52. | కృపగల ఉపదేశములు | (ఆధ్యాత్మిక ఎదుగుదలకైన ఉపదేశములు) | 100.00 |

**ఈ 52 పుస్తకముల మొత్తము వెల రూ. 3,000/-, రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చు ఉచితం!**

**మీ పూర్తి చిరునామాను (0) 89 39 39 39 39 నంబర్‌కు**
**Whatsapp (వాట్సప్) చేయండి లేదా Call (కాల్) చేయండి!**

**రుసుమును మీరు ఆన్‌లైన్ ద్వారా గాని లేదా గూగుల్ పే ద్వారా గాని మరియు**
**మనియార్డర్ ద్వారా గాని పంపవచ్చు!**

మా చిరునామా :

**జయపాల్ ఫౌండేషన్స్,**
**29, న్యూ కాలనీ రోడ్,**
**వేలచ్ఛేరి,**
**చెన్నై - 600 042.**

**Google Pay**

**JAYAPAUL N**

**+91 95000 01111**

**వివరములకు : (0) 89 39 39 39 39**

# కల్వరి దర్శనం టి.వి. కార్యక్రమాలు

6 భాషలలో 10 వ్యత్యాసమైన ఛానల్స్‌లో ప్రసారమౌతున్న మన టి.వి. కార్యక్రమాలు కొనసాగించుటకు ప్రార్థించండి! మీ సహకారాన్ని అందించండి!

| | | |
|---|---|---|
| **తెలుగులో** | మా మూవీస్‌లో | ప్రతిరోజు ఉదయం 6:30 ని॥లకు |
| | శుభవార్తలో | ప్రతిరోజు రాత్రి 7:00 గం॥లకు |
| | ఆరాధనలో | ప్రతిరోజు రాత్రి 8:00 గం॥లకు |
| **హిందీలో** | శుభసందేశ్‌లో | ప్రతిరోజు రాత్రి 7:30 ని॥లకు |
| **బెంగాలీలో** | జీ బంగ్లాలో | ప్రతి శుక్రవారం ఉదయం 6:30 ని॥లకు |
| **తమిళంలో** | నంబిక్కైలో | ప్రతి సోమవారం నుండి శనివారం వరకు రాత్రి 7:30 ని॥లకు |
| | తమిళన్‌లో | ప్రతి శనివారం రాత్రి 7:30 ని॥లకు |
| **మలయాళంలో** | హార్వెస్ట్‌లో | ప్రతి సోమవారం మధ్యాహ్నం 3:00 గం॥లకు |
| | పవర్ విజన్‌లో | శుక్ర, శని వారములలో మధ్యాహ్నం 12:30 ని॥లకు |
| **ఒరియాలో** | ప్రార్థన ఛానల్‌లో | ప్రతి శనివారం సాయంత్రం 4:00 గం॥లకు |

ఎంతో ఖర్చుతో, ప్రయాసతో జరుగుచున్న ఇట్టి భారభరితమైన పరిచర్యలో మీరు కూడా పాలిభాగస్థులగునట్లు **రూ. 1,000/-** లేక **రూ. 10,000/-** లేక ప్రభువు మిమ్మును ప్రేరేపించిన కొలది మీ విరాళములను, కానుకలను పంపి, దైవాశీస్సులు పొందండి!

M.O. లు, D.D. లు, చెక్కుల ద్వారా లేక **ఇప్పుడు అందరికీ అందుబాటులో ఉన్న** Online Transaction **ద్వారా మీ విరాళములు పంపించవచ్చు!** మీరు విరాళము పంపిన తరువాత ఫోన్ ద్వారా లేక SMS ద్వారా మాకు తెలియజేయండి!

**ONLINE వివరములు : Account Name: JAYAPAUL FOUNDATIONS**

**State Bank of India S.B. A/c No: 30699437837**
**I.F.S. Code : SBIN0001444,**
**Branch: Kodambakkam, Chennai-24.**

**ICICI Bank Current A/c No: 021205006901**
**I.F.S. Code : ICIC0000212,**
**Branch: Santhome, Chennai-4.**

**Andhra Bank Current A/c No: 207211100000229**
**I.F.S. Code : ANDB0002072**
**Branch : Kodambakkam, Chennai-24.**

ఇప్పుడు JAYAPAULFOUNDATIONS అకౌంట్‌కు QR కోడ్ ద్వారా కూడా మీ కానుకలు, విరాళములు పంపవచ్చు!

మీరు విరాళము పంపు విషయములో వివరములకై **(0) 89 39 39 39 39** నంబర్‌కు ఫోన్ చేయండి! లేక మీ పేరు, సెల్ నంబర్, విషయము ఈ సెల్ నంబర్‌కు SMS చేయండి!

**T.V. పరిచర్యకు మీ విరాళములు పంపుటకు మా చిరునామా :**

**JAYAPAUL FOUNDATIONS,**
**29, NEW COLONY ROAD,**
**VELACHERY, CHENNAI-600042.**

# సోషల్ మీడియాలో

## Dr. Jayapaul You Tube ఛానల్

## Subscribe చేసారా? లేనిచో ఇప్పుడే చేయండి!

**LIVEలో ప్రతిరోజు తప్పక వీక్షించండి!**

- ★ **'అనుదిన ధ్యానం'** ఉదయం 7:00 గం॥లకు!
- ★ **'కల్వరి ప్రతిధ్వని'** రాత్రి 9:00 గం॥లకు!
- ★ **'మన్నా మనకు'** అర్థరాత్రి 12:00 గం॥లకు!

**అలాగే లైవ్ ప్రోగ్రామ్స్, ప్రతి ఆదివారం ఆరాధనలు మరియు గెట్-టుగెదర్‌లు మరనేక కార్యక్రమాలు వీక్షించండి!**

Dr. Jayapaul You Tube **ఛానల్‌ను మరియు** facebook, twitter, Instagram **లలో ఇప్పుడే** Subscribe **చేయండి!**

Like **చేయండి!** Share **చేయండి!**

## కల్వరి ప్రేమధారల స్పైరల్ బౌండ్ బుక్స్

2013, 2014, 2015, 2016, 2017, 2018 మరియు 2019 సంవత్సరముల 'కల్వరి ప్రేమధార' పత్రికలు ఏ సంవత్సరానివి ఆ సంవత్సరం స్పైరల్ బౌండ్ బుక్స్‌గా (మొత్తం 7) సిద్ధంగా యున్నవి! ఒక్కొక్క సంవత్సరపు బౌండ్ బుక్ వెల రూ. 150/-. **అయితే 2018, 2019 సంవత్సరముల బౌండ్ బుక్స్ కేవలం రూ. 100/- లకే పొందగలరు! ఈ గొప్ప అవకాశాన్ని ఉపయోగించుకొనండి!**

అన్నీ కావాలంటే రిజిస్టర్డ్ పోస్ట్ ఖర్చుతో పాటు రూ. 500/- పంపి, పొందగలరు!

మీరు M.O.లు పంపవలసిన చిరునామా :

**CALVARY, 29, New Colony Road, Velachery, Chennai - 600 042.**

*Published and Edited by* : **N. JAYAPAUL,** 105, Ramanayakan Street, Nungambakkam, Chennai - 600 034. Printed by : R. Veera Raghavulu at Padmalaya Printers, 8/17, Manali Road, Chennai - 600 021. *Editor* : **N. Jayapaul**

# మనసు విప్పి మీతో ఒక మాట!

బాగున్నారా? మీరందరూ బాగుండాలని, ఆరోగ్యముగా ఉండాలని ప్రార్థిస్తూ; ప్రతిరోజు ఉదయం 7:00 గం॥లకు, రాత్రి 9:00 గం॥లకు, ఇప్పుడు మధ్యాహ్నం 3:00 గం॥లకు కూడా Youtubeలో Live ద్వారా దేవుని వాక్యాన్ని అందిస్తూ, ప్రార్థిస్తున్నాను! అంతేగాక, గత 900 దినముల నుండి ప్రతిరోజు మధ్యరాత్రి 12:00 గం॥లకు 'మన్నా మనకు' ద్వారా దేవుని సందేశాలను అందిస్తున్నాము!

మీరు వింటున్నారా? లేనిచో **Dr. Jayapaul Youtube** మరియు **Facebook Channels**ను Subscribe చేసుకొనండి!

అంతేగాక, ప్రతి ఉదయం 6:30 ని॥లకు మా మూవీస్‌లోను; రాత్రి 7:00 గం॥లకు శుభవార్తలోను మరియు 8:00 గం॥లకు ఆరాధనలోను 'కల్వరి దర్శనం' టి.వి. కార్యక్రమాలలో దేవుని వాక్యము అనేక సంవత్సరములుగా అందిస్తున్నాము!

మరి 1985లో ప్రారంభించిన 'కల్వరి ప్రేమధార' పరిచర్య నేటివరకు కొనసాగుచున్నది. Covid-19 Carona Virus వలన మార్చి-ఏప్రిల్ పత్రికను ఆలస్యముగా పోస్ట్ చేసాము. మీకు అందినదని నమ్ముచున్నాము! చెన్నై రెడ్‌జోన్‌గా చేసినందున, అంతా Lockdownలో ఉన్నందున; గత 37 సంవత్సరములలో ఒక్క ప్రతిని కూడా ఆపకుండా ప్రింట్ చేయబడినవి గాని, ఇప్పటి పరిస్థితిని బట్టి మే-జూన్ పత్రికను పోస్ట్ చేయలేక పోయాము! ఇప్పుడు అతి కష్టము మీద జూలై-ఆగస్టు పత్రికను సిద్ధపరచి, పోస్ట్ చేయుటకు ప్రయత్నిస్తున్నాము, ప్రార్థించండి!

ఈ పత్రిక పరిచర్య ఎంతో భారమైనది, ఖర్చుతో కూడినదైనను మీలో అనేకులకు ఆశీర్వాదకరముగా ఉన్నందున కొనసాగిస్తున్నాము, ప్రార్థించండి! ఈ పత్రికాభివృద్ధికి మీ సహకారము అందించండి! మీ అడ్రస్‌లో మార్పులున్నా, రెండు పత్రికలు అందుచున్నా తెలియజేయండి!

'కల్వరి ప్రేమధార' పాఠకులు, 'కల్వరి దర్శనం' ప్రేక్షకులు, అలాగే Liveలో Join అవుచున్న మీరందరూ క్షేమముగా ఉండాలని, ఈ తెగులు మన గుడారము లలో ప్రవేశించకుండా ప్రభువు రక్తమును విశ్వాసముతో ప్రోక్షించుచున్నాము!

మీలో ఎవరి కొరకైనా ప్రత్యేకముగా ప్రార్థించాలని ఆశిస్తే **9100 100 888** అనే నంబర్‌కు ఒక Whatsapp Text లేక Voice Message పంపించండి, తప్పక ప్రార్థిస్తాము! దయచేసి ఈ నంబర్‌కు Call చేయకండి, కేవలం Whatsapp Messages పంపండి!

మీరు పంపిన కానుకలు మరియు వార్షిక విరాళముల వివరములు తెలుసు కోవాలంటే **89 39 39 39 39** నంబర్‌కు Call చేయండి!

మీ ప్రార్థనా భారములకు ఈ నంబర్లకు Call చేయండి!

 **98847 07779**  **98848 07779**

త్వరలో ఆలయములు తెరువబడునట్లు; గెట్-టుగెదర్లు, మరి ఇతర పరిచర్యలు కొనసాగునట్లు ప్రార్థించండి!

**- యస్. జయపాల్**

Follow Our Social Media Pages
SUBSCRIBE - LIKE - SHARE

DR JAYAPAUL







